MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి: 20 సంచిక: 10 రంగారెడ్డి జూన్ 2022 పేజీలు : 36 వెల : రూ. 10/-

## ఆర్థిక అసమానతలపై ఉగాండా ప్రభుత్వ ప్రతినిధివర్గం సర్వే ... ఏపిమాస్ తోడ్పాటుతో ...





ఆర్థిక అసమానతల నిర్మూలనలో పొదుపు సంఘాల ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్న సర్వేలో భాగంగా ఉగాండా ప్రభుత్వ ప్రతినిధివర్గం హైదరాబాదులో నాబార్డ్, తెలంగాణా సహకార కేంద్రబ్యాంక్ ప్రతినిధులతో సమావేశం దృశ్యాలు

## ఏపిమాస్‌కు మూడు అంబులెన్స్‌లు ... ఎస్ బి ఐ వితరణ !




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ 108 అంబులెన్స్‌ల వాహన శ్రేణిలో భాగంగా ఏపిమాస్ ద్వారా అందజేస్తున్న మూడు అంబులెన్స్‌లను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్ బి ఐ ఎండి శ్రీ శ్రీనివాసులు శెట్టి, ఏపిమాస్ ఎండి, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ప్రభృతులు








ఉగాండా ప్రతినిధివర్గం పర్యటన ... మరికొన్ని దృశ్యాలు

PRAGATI OFFSET ప్రగతి ఆఫ్‌సెట్

NABARD నాబార్డ్ సౌజన్యంతో ....


नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
బహిరంగంగా బహిర్భూమికి వెళ్ళడం సరికాదు
మీ ఇంటి లోపల మరుగుదొడ్డి నిర్మాణం మంచి పరిష్కారం
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
You Tube /nabardonline
Taking Rural India >>Forward

# మహిళా సాధికారత


సంపుటి 20 సంచిక 10




సంపాదకీయం

## వివేకం !

అందరూ, ముఖ్యంగా రైతన్నలు, రైతక్కలు ఆశగా ఎదురు చూసే తరుణం రానే వచ్చింది. ప్రతి ఏటా యీ యెదురు చూపు మామూలే. వానలు బాగా కురుస్తాయని, పంటలు దండిగా పండుతాయని, తమ జీవితాలలో ఆనందం నిండుతుందని గత ఆశాభంగాలను మరచి కొత్త ఆకాంక్షలతో రైతులు వానాకాలానికి స్వాగతం పలుకుతారు. ఈ సారి ఆ ఆశల మహాజాతర మురిపిస్తూ ముందుగానే వచ్చేసింది. నిజానికి వానలు కురవడం, పంటలు బాగా పండడం, రైతు ధీమాగా తలెత్తుకుని తిరగడం ఒకదానికి ఒకటి తప్పనిసరిగా ముడిపడి వుంటాయనుకోవడం అవివేకమే అవుతుంది. వానలు బాగా కురిసినా పంటలు బాగా పండకపోవచ్చు, పంట పండినా ఏ తెగుళ్ళో సోకి దిగుబడి నీరసించవచ్చు, మంచి దిగుబడి వచ్చినా గిరాకీ లేకపోవచ్చు, గిరాకీ వున్నా మార్కెట్‌తో తగిన అనుసంధానాలు, అవగాహనలు లేక రైతు కష్టానికి తగిన ప్రతిఫలం లభించక పోవచ్చు ... యిలా బొత్తిగా తన అదుపులో లేని, కొంతమేరకు తనకు అర్ధంకాని ఎన్నో ప్రతికూల అంశాల దుష్ఫలితాలను రైతు అనుభవించవలసి వస్తున్నది. ప్రకృతి పరమైన అంశాలతో పాటు ఇటీవల ప్రభుత్వాల అవివేక నిర్ణయాలకు కూడా రైతు ఎంతగానో గురికావలసి వస్తున్నది. 'ధనమూలమిదం జగత్ ' ... అని ప్రపంచంలో ప్రతిదీ వ్యాపారంగా మారినా రైతు ఇంకా వ్యాపార సూత్రాలను ఒంటపట్టించుకోలేక పోతుండడం ఒక ప్రధాన సమస్య. మనకు లభించే అన్ని రకాల వస్తువులకు, సేవలకు ఆ ఉత్పత్తిదారులో , సేవలు సమకూర్చేవారో స్వయంగా వాటి ధర నిర్ణయిస్తారు. కాని ఆరుగాలం కష్టించి, ఎన్నో సమస్యలను తట్టుకుని పంటలు పండించే రైతుకు మాత్రం తన వ్యవసాయ ఉత్పత్తులకు తాను ధర నిర్ణయించే పరిస్థితి లేదు. ప్రభుత్వాలో, దళారీలో, కొనుగోలుదారులో తీర్మానించే ధరకు రైతు అమ్ముకోవలసిందే. ఇది తరతరాలుగా సాగుతున్న దోపిడీ. పైగా యీ దోపిడీ సాగించే శక్తులు కూడా బలీయంగా, వ్యవస్థీకృతంగా వుంటాయి. ఒంటరిగానో, అవగాహనా రహితంగానో వాటిని ఎదుర్కోవడం కష్టమే. కాని, ఎన్నాళ్ళు, ఎన్నేళ్ళు యిలా యీ దోపిడీని సాగనివ్వాలి ? దీనికి సమాధానం మాత్రం చాలావరకు రైతుల చేతులలోనే వుంటుంది. వ్యవస్థీకృత సంఘటిత శక్తి ముందు తలవంచక ఏ దుష్టశక్తులూ నిలువలేవు. అందువల్ల కావలసింది ముందుగా సంఘటితంకావడం, ఆపై తమచుట్టూ ఏం జరుగుతున్నదో ఆకళింపు చేసుకోవడం, అవగాహన పెంచుకోవడం. ఇప్పుడు 'వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలు, సంస్థల ' (ఎఫ్ పి ఓ లు , ఎఫ్ పి సి ల ) రూపంలో రైతులు సంఘటితమవుతుండడం సమస్య పరిష్కారానికి తొలిమెట్టు. ఇక కావలసింది వ్యాపారాత్మక వ్యవసాయంపై అవగాహన పెంచుకోవడం. అంటే ... భూసారం, నీరు వంటి ప్రకృతిపరమైన అంశాలు, పంట సంరక్షణ విధానాలు, ఉత్పత్తుల నాణ్యతతోపాటు , ఏ పంటకు ఏ సీజన్‌లో గిరాకీ వుంటున్నది, ఎక్కడ ఎక్కువ ధర లభిస్తున్నది, గిరాకీ వుంటున్నది కదా అని అన్ని చోట్ల, అందరం ఒకే సమయంలో , ఒకే పంటవేసి చేజేతులా ధర లేకుండా చేసుకుంటున్నామా, మార్కెట్‌తో తగిన అనుసంధానాలు ఏర్పాటు చేసుకుంటున్నామా లేదా, ఉత్పత్తుల విలువను పెంచే విలువ గొలుసు సూత్రాలను పాటించలేకపోతున్నామా వంటి ఆంశాల విషయంలో కూడా పట్టు సాధిస్తే తప్ప వ్యవసాయం స్వయంసాయంగా, ఆదాయదాయకంగా మారదు. ప్రతి రైతూ ఈ అన్ని అంశాలపట్ల పూర్తి అవగాహన కలిగి వుండడం ఆశించదగినదే అయినా ముందుగా ఎఫ్ పి ఓల సారథులు, నిర్వాహకులైనా ఈ అంశాలపై అవగాహనను పెంపొందించుకుని సభ్య రైతులకు సరైన మార్గదర్శకత్వం వహిమచగలగాలి.ఈ విషయంలో ఎఫ్ పి ఓ ల ప్రోత్సాహక సంస్థగా ఏపిమాస్ ఎన్నో శిక్షణలను, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నది. వీటిని అందిపుచ్చుకోవడం, అవగాహన పెంచుకోవడం ఎఫ్ పి ఓ ల వంతు. ప్రభుత్వాలు కూడా ఒక పంట వేయమని ఒకసారి, వేయవద్దని మరోసారి ... యిష్టారాజ్యంగా, రాజకీయ అనుకూల, ప్రతికూల ధోరణులతో ఆదేశాలు జారీచేయడం కాకుండా దూరదృష్టితో, యిటు రైతుల, అటు వినియోగదారుల ప్రయోజనాలను, భవిష్యత్ అవసరాలను, తమ నిర్ణయాల వల్ల సంభవించే దుష్పరిణామాలను సాకల్యంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవడం అవసరం. సామాజిక ఆహార భద్రత ప్రశ్నార్థకంగా మారకూడదు. ఆకాశంలోని మబ్బులను చూసి, కుండలోని నీరు పారబోసుకున్నట్టు కాకూడదు. వివేకం వికసిస్తుందని ఆశిద్దాం!




Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**


**అనుబంధం అంటే ఒకరిపట్ల ఒకరికి వుండే ఆత్మీయతే కాని, దీర్ఘకాల పరిచయమో, ఇచ్చిపుచ్చుకోడమో కాదు**

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

## లోపలి పేజీలలో ....

➪ ఎస్‌హెచ్‌జిలపై ఉగాండా ప్రభుత్వ సర్వే ! ...05
➪ రూరల్‌మార్ట్‌ను ప్రారంభించిన ధీశాలి ఎఫ్‌పిసి ...07
➪ ఫ్లిప్ కార్ట్‌లో మహిళా గ్రూపుల ఉత్పత్తులు ! ...08
➪ తెలంగాణాలో పోషకాల రేషన్ బియ్యం ! ...09
➪ నాబార్డ్ తోడ్పాటుతో మెరిసిన బతుకులు ! ...10
➪ పంటరుణాలకు పరిమితి ఖరారు ...12
➪ శుద్ధిచేసిన విత్తనాలతో పంట క్షేమం! ...13
➪ సిజేరియన్ శస్త్రచికిత్సలపై ప్రతిరోజూ ఆడిట్ ! ...14
➪ సేంద్రియ పెరటి తోటల విప్లవ గ్రామం ! ...16
➪ ఇంట్లోనే కూరగాయలు సాగు చేద్దాం! ...17
➪ కుంగిపోయే రైతు కన్నీళ్ళు తుడిచే 'కిసాన్ మిత్ర' ...18
➪ పక్షుల సంరక్షణ కోసం పదివేల సైన్యం! ...20
➪ తెలంగాణాలో మోకాలి చిప్పల మార్పిడి ...22
➪ కూరగాయల విక్రేత కూతురు సివిల్ జడ్జి! ...24
➪ అమెరికాలో గుర్తింపు పొందిన మహిళా రైతు! ...25
➪ కిరాణాకొట్టు నుంచి కంపెనీ సీఈవోగా... ...26
➪ మహిళా రైతుల ఆదాయం ఏడాదికి ... ...28
➪ మహిళల పట్ల అన్యాయాన్ని కమిషన్ దృష్టికి .... ...29
➪ మొక్కే విత్తనమై స్వయంసహాయ వటవృక్షమై! ...30
➪ మహిళా ఉద్యోగుల పనివేళలపై యుపి ... ...31
➪ రోజుకు 4 గంటల పని ... ! ...32
➪ పిండి పదార్థాలు ... మంచీ, చెడు ... ...34

### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశంలోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

ఈరోజును వ్యర్థపరచుకునేవాడికి రేపటిరోజు మంచిదెలా అవుతుంది?

# మన ఎస్ హెచ్ జి లపై ఉగాండా ప్రభుత్వ సర్వే !

– జి. శ్రీనివాస్



మన దేశంలోని స్వయం సహాయ సంఘాల, సంస్థల తీరుతెన్నులను పరిశీలించి, తమ దేశంలో స్వయంసహాయ వ్యవస్థ నిర్వహణకు అనువైన విధానాల రూపకల్పనలో సలహాలు, సూచనలను రూపొందించుకోవడంలో భాగంగా ఉగాండా ప్రభుత్వ విధాన ప్రతినిధుల బృందం 2022 మే 1 వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఎనిమిది రోజుల పాటు హైదరాబాదు లోను, చుట్టుపక్కల ప్రాంతాలలో పర్యటించింది. ఆరుమంది సభ్యులతో కూడిన ఈ బృందం సాగించిన ఈ పరిశీలక పర్యటనకు ఏపిమాస్ అన్నివిధాల తోడ్పాటు అందించింది. ఈ ఆరుమంది బృందంలో ఇద్దరు ఉగాండా దేశ ఆర్థిక మరియు ప్రణాళిక అభివృద్ధి విభాగం అధికారులు, ఇద్దరు మకేరే యూనివర్శిటీ బిజినెస్ స్కూల్ ప్రొఫెసర్స్, మిగిలిన ఇద్దరు కేర్ ఇంటర్నేషనల్ ఉగాండా అధికారులు . వీరు తమ పర్యటనలో ముందుగా హైదరాబాదులోని ఏపిమాస్ శిక్షణ కేంద్రంలో సంబంధిత వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం కోసం ఏపిమాస్ బృందంతో చర్చించారు. ఉగాండా దేశంలోని సంఘాల, సంస్థల స్థితిగతులపై వారి అనుభవాలను పంచుకొన్నారు. ఏపిమాస్ ఎండి , సి ఇ ఓ శ్రీ సి.యస్ రెడ్డి, కన్సల్టెంట్ శ్రీమతి రామలక్ష్మి మనదేశంలోని, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని సంఘాల, సమాఖ్యల విషయాలపై వారికి అవగాహన కల్పించారు.

సందర్శనలో భాగంగా తెలంగాణా రాష్ట్ర సహకార బ్యాంకును సందర్శించారు. బ్యాంకు ప్రెసిడెంట్ శ్రీ కొండూరి రవీందర్‌రావు , మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ మురళీధర్ బృందంతో సమావేశమై తెలంగాణా రాష్ట్ర సహకార బ్యాంకు ద్వారా మహిళా సంఘాలకు, సంస్థలకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు.

స్త్రీ నిధి కో–ఆపరేటివ్ బ్యాంకును సందర్శించి మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ జి.విద్యాసాగర్ రెడ్డి , వారి సిబ్బందితో సమావేశమై స్త్రీ నిధి కో– ఆప రేటివ్ బ్యాంకు తీరుతెన్నులు, మహిళా సంఘాలకందిస్తున్న ఆర్థికపరమైన సేవలు, చేస్తున్న కార్యక్రమాలను తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని సంఘాల, సమాఖ్యలకోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో పనిచేస్తున్న అతిపెద్ద సంస్థ అయిన సెర్ప్ ద్వారా ఏర్పాటు చేసిన సంఘాలు, సమాఖ్యలు చూడటానికి హన్మకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలంలోని మహిళా సంఘాలు, గ్రామ సంఘం, మండల సమాఖ్యలను సందర్శించి, సంఘాల సభ్యులతో మాట్లాడారు. వారు సంఘాలను ఏవిధంగా నిర్వహిస్తున్నారు, వారికి ప్రభుత్వ సహకారం, సంస్థల సహకారం ఏవిధంగా ఉన్నదో తెలుసుకున్నారు. సంఘాలు చేసే పొదుపులు, తీసుకున్న అప్పులు వాటి నిర్వహణ , సంస్థలు అనుసరించే ఉత్తమ పద్ధతులు, సంఘాల ద్వారా అందుతున్న వివిధ రకాలైన సేవలను తెలుసుకొని సంతృప్తి వ్యక్తపరిచారు.

అనంతరం భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ కో–ఆపరేటివ్ సొసైటీని సందర్శించి 65 సంవత్సరాలుగా



ఏర్పడి, వారి అనుభవాలను, టీం సభ్యులు నేర్చుకున్న వివిధ అంశాలను చర్చించారు.

ఉగాండా టీం సభ్యులు మాట్లాడుతూ... ఇంత చక్కని ప్రణాళికతో వారి ఎనిమిది రోజుల పర్యటనలో సంబంధిత అందరు భాగస్వామ్య సంస్థలను కలిసి చర్చించడం తమ దేశ సంఘాల సభ్యులకోసం తాము రూపొందించాలనుకున్న విధానాల రూపకల్పనకు ఎంతగానో ఉపయోగకరంగా ఉన్నదని, దేశ స్థాయిలో, రాష్ట్ర స్థాయిలో సంఘాల కోసం సంస్థల కోసం ప్రభుత్వం, ఏపిమాస్ లాంటి సంస్థలు అందిస్తున్న సేవలను ఎంతో విశిష్టంగా వున్నాయని వారు కొనియాడారు. ఇంత చక్కని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఏపిమాస్‌ను ఉగాండా బృంద సభ్యులందరూ అభినందించి, ప్రత్యేకంగా శ్రీ సి.యస్ రెడ్డి , శ్రీమతి యస్.రామలక్ష్మి , శ్రీ జి. శ్రీనివాస్ , శ్రీ రాజశేఖర్ , శ్రీ గోవిందలతో కూడిన ఏపిమాస్ బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సంస్థ ఏర్పాటు చేసి రైతుల కోసం చేస్తున్న కార్యక్రమాలను తెలుసుకున్నారు. సంఘాల సభ్యులు ఐక్యంగా ఉంటే, మంచి నాయకత్వం కలిగి ఉంటే, నమ్మకంతో పని చేస్తే, వ్యాపార అభివృద్ధి కార్యక్రమంలో అందరు పాలుపంచుకుంటే ఏవిధంగా అభివృద్ధిలోనికి రావచ్చో నేరుగా చూసి నేర్చుకున్నా మన్నారు. ఈ క్షేత్ర సందర్శనలో శ్రీమతి రామలక్ష్మి , శ్రీ జి. శ్రీనివాస్ వీరి వెంట ఉండి అన్ని విషయాలు అర్థం అయ్యేలాగా వారికి తర్జుమా చేసి తెలిపారు.

సందర్శనలో భాగంగా తెలంగాణ నాబార్డు రాష్ట్ర కార్యాలయం సందర్శించి నాబార్డు చైర్మెన్ శ్రీ వై.కే.రావు, నాబార్డు రాష్ట్రస్థాయి అధికారులతో సమావేశమై నాబార్డు ద్వారా మహిళా సంఘాలకు, సంస్థలకందుతున్న సేవలు, కార్యక్రమాలను తెలుసుకున్నారు. నాబార్డు అధికారులు వివరించిన అంశాలు తమ దేశంలో ఎంతగానో ఉపయోగకరంగా వుంటాయని, సంఘాలకోసం నాబార్డు చేస్తున్న కార్యక్రమాలు వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని వారి సేవలను కొనియాడారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి అధికారులైన శ్రీ నటరాజన్ బృందంతో ముఖాముఖీ చర్చా కార్యక్రమం చేపట్టటం జరిగింది. ఇందులో స్టేట్ బ్యాంకు సభ్యులకు, సంఘాలకు అందిస్తున్న అప్పు, ఆర్థిక పరమైన విషయాలను తెలుసుకున్నారు.

కార్యక్రమం చివరిరోజు ఏపిమాస్ కార్యాలయంలో ఏపిమాస్ బోర్డు సభ్యులు శ్రీ మోహనయ్య ,శ్రీ డబ్ల్యు.ఆర్. రెడ్డి, ఏపిమాస్ యం.డి. శ్రీ సి.యస్ రెడ్డి ఒక ప్యానల్‌గా

**భీమదేవరపల్లిలో ...**

భీమదేవరపల్లి మండలంలో ఐకేపీలో కొనసాగుతున్న స్వశక్తి మహిళా సంఘాల పనితీరును ఉగాండా దేశ ప్రతినిధుల బృందం అధ్యయనం చేసింది. మండల కేంద్రంలోని స్వర్ణాంజలి, సరస్వతి-2 బృందం సమావేశానికి ఉగాండా ప్రతినిధుల బృందం హాజరై క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారు. మహిళలు పోగేసిన డబ్బులను రుణం రూపంలో సభ్యులు తీసుకోవడం, ప్రభుత్వం కల్పిస్తున్న ప్రోత్సాహం గురించి అడిగి తెలుసుకున్నారు.

తమ దేశం లోనూ అమలు చేస్తామని పేర్కొన్నారు. సర్పంచ్ మాడుగుల కొమురయ్య, ఎంపీటీసీ అప్పని పద్మ, డీపీఎం అనిల్, ఏపీఎంలు కోటేశ్వర్, దేవానంద్, రాజు, సీసీలు కరుణాకర్, సదానందం, నాగమణి, సతీశ్, బాలసుందర్, వీవోఏలు సరిత, సునిత, రజిత, రసజ్ఞ, పద్మజ, కవిత, జమున, మానస, పరమేశ్వరీ, భారత మండల సమాఖ్య అధ్యక్షురాలు సబిత, కార్యదర్శి జ్యోతి పాల్గొన్నారు. ■

నీవు పని చేయడం మొదలుపెట్టనిదే ఏ పనీ కాదు

# రూరల్ మార్ట్ ను ప్రారంభించిన ధీశాలి ఎఫ్ పి సి






**బొ**మ్మలరామారం మండలంలోని సోలిపేట్ 'గ్రామీణ మహిళా మండలి' (జి ఎం ఎం) సహకారంతో ఏర్పడిన ధీశాలి ఎఫ్‌పీసీఎల్ (రైతు మహిళా ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్) ఆదర్శ ఎఫ్ పి సి గా, మిగతా సంఘాలకు దిశా నిర్దేశం చేసే స్థాయికి ఎదగాలని నాబార్డు సీజీఎం శ్రీ వై.కె.రావు కోరారు. మండలంలోని చీకటిమామిడిలో గల రైతు వేదికలో మే 4వ తేదీన 'ధీశాలి రైతు మహిళా ఎఫ్ పి సి' నిర్వహణలో 'రూరల్ మార్ట్ ' వాహనాన్ని ప్రారంభించి ఆయన ప్రసంగించారు. ధీశాలి ఉత్పత్తిదారుల కంపెనీ ఎదుగుదలకు నాబార్డు నుంచి అన్ని విధాలా సహకారం అందజేస్తామన్నారు.

ఏపీమాస్ ఎండీ , సీఈఓ శ్రీ సీఎస్ రెడ్డి మాట్లాడుతూ, ధీశాలి ఎఫ్‌పీఓ ఒక వ్యాపార సంస్థగా అభివృద్ధి చెంది ప్రభుత్వం అందించే అన్ని రకాల సబ్సిడీలతో పాటు గ్రాంట్లను అందుకోవాలన్నారు. జీఎంఎం అధ్యక్షురాలు శ్రీమతి దూబల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో యింకా నాబార్డు ఏజీఎంలు తపన్ సాహు, శ్వేత సింగ్, నల్లగొండ డీడీఎంలు వినయకుమార్, సత్య నారాయణ, ఏపీజీవీబీ అధికారులు రవి కృష్ణ, అనూప్ కుమార్, కిశోర్‌కుమార్, పీస్ సంస్థ డైరెక్టర్ నిమ్మయ్య, ధీశాలి ఛైర్ పర్సన్ మంజుల, సీఈఓ హరిలాల్ తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' సౌజన్యంతో.... ■






పరాజయానికి కారణం శక్తిహీనతో, అజ్ఞానమో కాదు; సంకల్ప లోపమే అసలు కారణం

# ఫ్లిప్ కార్ట్‌లో మహిళా గ్రూపుల ఉత్పత్తులు !

మహిళా గ్రూపుల ఉత్పత్తులను ఫ్లిప్ కార్ట్‌లోనూ, ఫ్లిప్ కార్ట్ వస్తువులను మహిళా గ్రూప్ స్టోర్స్‌లో అందుబాటులో ఉంచేందుకు తెలంగాణా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వనపర్తి తరహాలో ముందుగా జనగామ జిల్లాలో తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లాలో అమలు చేయాలని నిర్ణయించారు. జీవనోపాధికి, పారిశ్రామికులను ప్రోత్సహించడానికి ఉపయోగపడడమే కాకుండా ఈ ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు  మెరుగు పడతాయని భావిస్తున్నారు. దీనిపై త్వరలోనే ఒప్పందం, ప్రణాళికలు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి శ్రీ ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాలు జారీ చేశారు.

'గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ' (సెర్ప్)  స్వయం సహాయ సంఘాలను, వాటి సమాఖ్యలను ప్రోత్సహిస్తూ, ఆర్థిక వనరులను అందుబాటులోకి తెస్తూ, వివిధ జీవనోపాధులను కల్పిస్తూ వస్తున్నది. అలాగే, మహిళా సంఘాల ద్వారా వివిధ వస్తువుల ఉత్పత్తులను ప్రోత్సహిస్తున్నది.

ఆ ఉత్పత్తులకు మార్కెట్‌ను అనుసంధానిస్తున్నది. ఈ నేపథ్యంలో  సంఘాలు, సమాఖ్యలు చేస్తున్న ఉత్పత్తులకు మరింత మెరుగైన మార్కెట్ వసతి కల్పించే ప్రయత్నాల్లో భాగంగా పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), ప్రముఖ ఆన్‌లైన్ వ్యాపార సంస్థ ఫ్లిప్ కార్ట్‌తో ఒప్పందానికి సిద్ధపడింది. ఇందుకు ఫ్లిప్ కార్డ్ సై అంది. ఇప్పటికే వనపర్తి జిల్లాలో ఇలాంటి ఒప్పందం కుదుర్చుకున్న ఆ సంస్థ  ఇదే విషయమై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ మంత్రి శ్రీ ఎర్రబెల్లి దయాకర్‌రావుతో ఇటీవల సంప్రతింపులు జరిపారు.

స్వయం సహాయక సంఘాలు తయారు చేసే వస్తువులను ఫ్లిప్ కార్ట్ తన ఆన్ లైన్‌లో పెడుతుంది. అలాగే ఫ్లిప్ కార్ట్ వ్యాపార వస్తువులను స్వయం సహాయక సంఘాల స్టోర్స్, స్టాల్స్‌లో అమ్మకానికి పెడతారు. ఈ ఇచ్చి పుచ్చుకునే వ్యాపార వ్యవహారం ద్వారా పరస్పరం లాభం పొందుతారు. తద్వారా ఇరు వర్గాల వ్యాపారం, మార్కెట్ విస్తారం అవుతుంది. లాభాలు వస్తాయి. అలాగే ఎఫ్ పి ఓ ల నుండి రైతులు పండించిన పంటలను కూడా అందుబాటులో ఉంచుతారు.

జిల్లాలో ఏర్పాటు చేసిన 60 తెలంగాణ స్త్రీ శక్తి మార్టులు కూడా బలోపేతం అవుతాయి. చేనేత వస్త్రాలు, హస్తకళా వస్తువులు కూడా ప్రపంచానికి చేరువ అవుతాయి.

ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, ఫ్లిప్కార్ట్‌తో ఒప్పందం పేదరిక నిర్మూలనకు, స్వయం సహాయ సంఘాలకు, సమాఖ్యలకు, ఎంతో మేలు చేస్తుందని అన్నారు. ముందుగా జనగామ జిల్లాలో ప్రారంభించాలని,  తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లా, ఆ తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని , ఇందుకు తగిన విధివిధానాలను రూపొందించాలని, ప్రణాళికలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ■

## ఏపీ గ్రామీణాభివృద్ధి శాఖకు జాతీయ స్థాయిలో గుర్తింపు

ఏపీ గ్రామీణాభివృద్ధి శాఖకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ స్కోచ్ 'స్టార్ ఆఫ్ గవర్నెన్స్' అవార్డుకు ఎంపికైంది. జూన్ 18న ఢిల్లీలో జరిగే ఇండియన్ గవర్నెన్స్ ఫోరం వేదికగా ఈ అవార్డు ప్రదానం చేస్తారు.

గ్రామీణాభివృద్ధి శాఖకు స్కోచ్ అవార్డు లభించడం పట్ల ఏపీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హర్షం వ్యక్తం చేశారు. సీఎం జగన్ గ్రామీణ పాలనలో అనుసరిస్తున్న విప్లవాత్మక విధానాలు, పారదర్శకత, ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు వంటి సంస్కరణల వల్లే రాష్ట్రానికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. ■

ఓడిపోతానేమోననే భయం నిన్ను విజయ తీరానికి చేరుస్తుంది

# తెలంగాణాలో పోషకాల రేషన్ బియ్యం !

నిరుపేదలకు పోషకాహారాన్ని అందించే సదుద్దేశంతో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఇకపై పోషక విలువలతో కూడిన రేషన్ బియ్యాన్ని పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే మే నెల నుంచి తొలి విడతగా రాష్ట్రం లోని భద్రాద్రి కొత్తగూడెం, భూపాలపల్లి, కొమరంభీం ఆసిఫా బాద్, ఆదిలాబాద్ నాలుగు జిల్లాలలో ప్రభుత్వం ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేశారు.

నాలుగు జిల్లాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన ఫలితాల ఆధారంగా ఒకటి, రెండు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యాన్ని సరఫరా చేసేందుకు సిద్ధమవుతోంది.

ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా నుంచి ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇక్కడ కూడా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రైస్ మిల్లులు లేకపోవడంతో ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరాకు ఆటంకంగా మారింది.

**ఆరు రకాల పోషక గుణాలు**

ప్రస్తుతం ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యంలో ఆరురకాల పోషక గుణాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇందులో మైక్రో న్యూట్రి యంట్స్, ఐరన్, ఫోలిక్‌యాసిడ్, బికాంప్లెక్స్, విటమిన్-2, విటమిన్ ఏ, జింక్, మరికొన్ని పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని చౌకధరల దుకాణాలలో సరఫరా చేస్తున్నారు.

తొలివిడతలో డిమాండ్ కంటే తక్కువగానే సరఫరా కావడంతో... ముఖ్యంగా ఏజెన్సీ గిరిజన గ్రామాలలో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేసేందుకు ప్రాధాన్యతనిచ్చారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు ఈ బియ్యాన్ని సరఫరా చేయనున్నారు. ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీతో అక్రమ బియ్యం సరఫరాకు కూడా అడ్డుకట్ట పడే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు.

ఇన్నాళ్ళు రేషన్ బియ్యాన్ని తీసుకుంటున్న కొందరు లబ్ధిదారులు తినకుండా దళారులకు అమ్మేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పోషక విలువలతో కూడిన రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తే కొంతవరకు అయినా తినేందుకు రేషన్ లబ్ధిదారులు ఇష్టపడతారని అధికారులు అంచనా వేస్తున్నారు. మొత్తానికి పేద ప్రజలకు పోషకాహారం అందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై మంచి స్పందనే కనిపిస్తోంది.

**రేషన్ బియ్యమే ఆధారం**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వరి పంట సాగు కనిష్టం గానే కనిపిస్తుంది. వానాకాలంలో వెయ్యి ఎకరాల లోపే వరి పంట సాగవుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. దీంతో గ్రామీణ, పట్టణ నిరుపేదలు రేషన్ బియ్యంపైననే ఆధారపడాల్సి వస్తుంది.

ప్రస్తుతం ప్రభుత్వం రూపాయికి కిలో చొప్పున ఒక్కొక్కరికి ఆరు కిలోల వరకు రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తోంది. ఎలాంటి ధర పెంపు లేకుండా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేయడంతో పేదలకు ఎంతో ప్రయోజనం కలిగే అవకాశం ఉంది. జిల్లాలో ఎక్కువగా మారుమూల గిరిజన గ్రామాలే ఉన్నాయి. తరతరాలుగా ఆదివాసీ గిరిజనులు పౌష్టికాహార లోపంతో బాధపడుతూ అనారోగ్యం బారిన పడుతున్నారు.

ముఖ్యంగా గర్భిణులలో ఎక్కువగా రక్తహీనత సమస్య కనిపిస్తోంది. దీంతో మాతా, శిశు మరణాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసీ గిరిజనుల్లో రక్తహీనత సమస్యను దూరం చేసేందుకు ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తున్నా సరైన ఫలితం దక్కడం లేదు.

ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, చిన్న పిల్లలకు పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఇకపై స్థానిక చౌకధరల దుకాణాల్లో ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేస్తే కొంత మేరకైనా పౌష్టికాహార లోపాన్ని తగ్గించే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ■

# నాబార్డ్ తోడ్పాటుతో మెరిసిన బతుకులు !



శ్రీమతి మియాపురపు సింధుజ

> ***నాబార్డ్ చేపట్టిన చిరు వ్యాపార అభివృద్ధి కార్యక్రమం (ఎం ఇ డి పి) తోడ్పాటుతో తమ జీవనోపాధులను మెరుగు పరచుకున్న స్వయం సహాయ మహిళల విజయ గాధలు***

శ్రీమతి మియాపురపు సింధుజ తెలంగాణా రాష్ట్రం వరంగల్లు జిల్లా చింతనికొండ గ్రామస్తురాలు. ఆమె భర్త నుంచి విడాకులు తీసుకుని, పూర్తిగా తల్లిపై ఆధారపడి జీవిస్తుండేవారు. ఆమె కుటుంబపరమైన అనేక సమస్యలతో పాటు, ఆర్థికపరంగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కోవలసి వచ్చింది. అలాంటి దశలో ఆమె నాబార్డ్ ఆర్థిక సహకారంతో చేపట్టిన 'ఆరి ఎంబ్రాయిడరీ (మగ్గం)' అల్లికల శిక్షణలో చేరడం ఆమె జీవితాన్ని గొప్ప మలుపు తిప్పింది. శిక్షణ పూర్తి అయింది మొదలు ఆమెకు చుట్టుపట్టు గ్రామాలు, పట్టణాల నుంచి బ్లౌజులు, దుస్తులు, ఇతర మగ్గం ఉత్పత్తులకోసం నేరుగా ఆర్డర్లు రాసాగాయి. ఇప్పుడు ఆమె తనంతట తాను ఒక ఉపాధిని (స్వయం ఉపాధిని) పొందగలిగింది, నెలకు 25,000 రూపాయలు సంపాదించగలుగుతున్నది.

శ్రీమతి కొండపల్లి రజిత వరంగల్లు జిల్లా వెంకటాపురం గ్రామానికి చెందిన గృహిణి. ఆమెకు చాలా కాలంగా మగ్గం అల్లికలు, డిజైన్ల శిక్షణ పొందాలని, మెళకువలు నేర్చుకోవాలని ఎంతో ఆసక్తి. కాని, ఆ శిక్షణకు అయ్యే అధిక వ్యయం భరించలేక ఊరుకోవలసి వచ్చింది. ఆ దశలో నాబార్డ్ తోడ్పాటుతో చేపట్టిన ఎం ఇ డి పి శిక్షణ అందుబాటులోకి రావడంతో డబ్బేమీ చెల్లించవలసిన అవసరం లేకుండానే ఆమె ఎంబ్రాయిడరీ అల్లికలను నేర్చుకోగలిగింది. ఇప్పుడు ఆమె తన యింటివద్దే కొద్దిపాటి పెట్టుబడితో, కృషితో బ్లౌజ్ డిజైనింగ్ ద్వారా మంచి ఆదాయం పొందగలుగుతున్నారు. ప్రస్తుతం ఆమె నెలకు 15,000 రూపాయలు సంపాదించగలుగుతున్నది.



శ్రీమతి కొండపల్లి రజిత

**గతాన్ని తలచుకుని కుమిలిపోవడం కాదు, ఆ గతం నుంచి జీవిత పాఠాన్ని నేర్చుకోగలగాలి**





శ్రీమతి దేవులపల్లి మున్నా

శ్రీమతి దేవులపల్లి మున్నా ఒక గృహిణి. గతంలో ఆమె తన ఊళ్ళో మెహెందీ డిజైన్లు వేస్తుండేది. కాని దానిమీద వచ్చే ఆదాయం ఆమె కుటుంబ అవసరాలు తీరడానికి సరిపోయేది కాదు. ఆ దశలో ఆమె నాబార్డ్ ఆర్థిక సహకారంతో నిర్వహించే 'ఆరి ఎంబ్రాయిడరీ (మగ్గం)' అల్లికల శిక్షణలో చేరి ఆ అల్లికలకు సంబంధించిన అన్ని మెళకువలను నేర్చుకున్నారు.

ప్రస్తుతం ఆమె తన ఊళ్ళో తానే మగ్గండిజైన్లను, అల్లికలను ప్రారంభించారు. నెలకు 12,000 నుంచి 15,000 రూపాయలు సంపాదిస్తున్నారు. తన కుటుంబ మౌలిక అవసరాలను తీర్చుకోగలుగుతున్నారు.



శ్రీమతి బండారి స్రవంతి

శ్రీమతి బండారి స్రవంతి ఒక గృహిణి.ఆమెకు టైలరింగ్ కొంతవరకు వచ్చు.కాని టైలరింగ్ సీజనల్ వృత్తి కావడమే కాక, దానిమీద వచ్చే ఆదాయంకూడా సరిపోయేది కాదు.ఆ సమయంలో ఆమె నాబార్డ్ ఆర్థిక సహకారంతో నిర్వహించే నైపుణ్యాభివృద్ధి శిక్షణలో చేరి, శిక్షణ పూర్తయ్యేసరికి నిపుణులైన శిక్షకుల శిక్షణలో తన నైపుణ్యాలను పెంచుకుని, యిప్పుడు తన యింటివద్దనే టైలరింగ్‌తో పాటు మగ్గం డిజైన్ , అల్లికల పనులు కూడా చేస్తూ నెలకు 20,000 రూపాయలవరకు సంపాదించగలుగుతున్నారు. ■

# పంటరుణాలకు పరిమితి ఖరారు

**ఉ**మ్మడి చిత్తూరు జిల్లాలో ఖరీఫ్, రబీ కాలంలో మంజూరు చేసే పంటరుణాలకు ప్రభుత్వం పరిమితిని ఖరారు చేసింది. గత ఏడాది అమలు చేసిన రుణ పరిమితిలో స్వల్ప మార్పులు చేసి ఈ ఏడాది (2022-23) రైతులకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు కంట్రోలింగ్ అధికారులకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఎకరా సాగుకు బ్యాంకులు మంజూరు చేసే రుణ వివరాలు ఇలా ఉన్నాయి.

అరటి (టిష్యూ కల్చర్) పంటకు రూ.95 వేల నుంచి రూ. 1,04,500కు కరివేపాకు రూ. 38వేల పరిమితిని రూ.70 వేలకు పెంచారు. చెరుకు. (ప్లాంటేషన్)కు రూ.75 వేలు నుంచి రూ.7500, మరదాముకు రూ. 65 వేలు నుంచి రూ.66 వేలకు పెంచారు. వేరుశనగ (బావుల కింద) పంటకు రూ.28 వేల నుంచి రూ.32. వేలకు పెంచగా,





వర్షాధార పంటకు రూ.35 వేలు నుంచి రూ.26 వేలకు రుణ పరిమితి తగ్గించారు. టమోటా ధార పంటకు రూ.30 వేల నుంచి రూ. 33 వేలకు, హైబ్రీడ్ రకానికి రూ.75 వేల నుంచి రూ.77 వేలకు స్వల్పంగా పెంచారు. టమాట కొయ్యాధారిత (పెండెల్) పంటకు రూ.5 వేల రుణపరిమితిని రూ.65 వేలకు తగ్గించారు.

ఉల్లిపాయలకు రూ.40వేలు ఆలుగడ్డకు రూ.40 వేల నుంచి రూ.44 వేలకు, మల్బరీ రూ. 75 వేల నుంచి రూ. 80,500కు సూర్యకాంతికి రూ.10 వేల నుంచి రూ.22వేలకు బొప్పాయి తైవాన్ రకం రూ.70 వేల నుంచి రూ.77 వేలకు పెంచారు.

మామిడితోటల నిర్వహణకు రూ.40 వేల రుణాన్ని రూ.38,500కు, వంకాయలకు 40 వేల రూపాయల నుంచి 44 వేలకు, బెండ హైబ్రీడ్ రకానికి 35 వేల రూపాయల నుంచి 38,500 రూపాయలకు పెంచారు. కాగా చామంతికి ఇస్తున్న రూ.45 వేలు, టేబుల్‌రోస్‌కు ఇస్తున్న రూ.55 వేలు, చెండుమల్లికి ఇస్తున్న రూ.40 వేలు, మొక్కజొన్న కిస్తున్న రూ.34 వేల రుణపరిమితిని యథావిధిగా కొనసాగించాలని బ్యాంకర్లకు సూచించారు. ■

## వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలతో రైతులకు ఎంతో మేలు

**వ్య**వసాయ ఉత్పత్తిదారుల సంఘాలతో రైతులకు మేలు కలుగుతుందని స్పందన, సాయి స్వచ్ఛంద సంస్థల సెక్రెటరీలు సిహెచ్. సోమయ్య, ఈదపాక వెంకన్న అన్నారు. మరిపెడ మున్సిపాలిటీ కేంద్రంలో స్పందన, సాయి స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఏపిమాస్ వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీల మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాల ఏర్పాటు వలన కలిగే లాభాలను వివరించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలతో అధిక లాభాలు ఉంటాయని తెలిపారు. రైతులు సంఘటితంగా ఉండటం ద్వారా ఏదైనా సాధించవచ్చన్నారు. వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా రైతులు సాగు చేసే పంటలపై వచ్చే తెగుళ్ల నివారణ మెలకువలు, పెట్టుబడులు, సాంకేతికతను తెలుసుకుని ముందడుగు వేయడానికి ఎంతగానో తోడ్పడుతాయని తెలిపారు. ప్రతి గ్రామంలో వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలను వీలైనంత ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు.

ఏపిమాస్ శిక్షకులు గంగాధర్, రంజిత్ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ■

# శుద్ధిచేసిన విత్తనాలతో కొద్ది వానకే పంట క్షేమం!

మెట్ట భూముల్లో 365 రోజులూ నిరంతరాయంగా ప్రకృతి పంటల సాగులో తొలి దశ వానకు ముందే విత్తటం (ఇదే ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ –పీఎండీఎస్)లో ప్రత్యేక పద్ధతులను రైతులు అనుసరించాల్సి ఉంటుంది. 365 డిజీసీ పద్ధతిని ప్రారంభించే రైతులు తొలి సంవత్సరం మొదట్లో మాత్రమే దుక్కి దున్నాల్సి ఉంటుంది. తదనంతరం ఎప్పుడు అవసరమైతే అప్పుడు మనుషులు చేతులతోనే విత్తన గుళికలు విత్తుకోవాలి. మళ్లీ దుక్కి చేయాల్సిన అవసరం లేదు.

20కి పైగా పంటలు ఒకేసారి విత్తుకున్నప్పటికీ ఆయా ప్రాంత వాతావరణ పరిస్థితులు, రైతుల ఆసక్తి, పంట కాలాలను బట్టి ప్రధాన పంటలను ఎంపిక చేసుకోవాలి. వానకు ముందే వేసవిలో విత్తుకోవాలి కాబట్టి వేడిని తట్టుకోవడానికి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. విత్తనాలకు లేపనం చేయటం ముఖ్యమైన విషయం.









బంకమట్టి, ఘన జీవామృతం పొడులతో పాటు బూడితతో లేపనం చేసిన విత్తన గుళికలను మాత్రమే విత్తుకోవాలి. విత్తనాన్ని బొచ్చెలో లేదా గోనె సంచిలో పోసి అటూ ఇటూ ఊపుతూ.. బీజామృతంను తగుమాత్రంగా చిలకరిస్తూ... తొలుత మెత్తగా వజ్రకాయం పట్టిన బంక మట్టి లేదా చెరువు మట్టిని విత్తనాలపై చల్లాలి.

తర్వాత మెత్తగా చేసిన ఘన జీవామృతం పొడిని అవే విత్తనాలపై వేస్తూ బీజామృతాన్ని తగు మాత్రంగా, తగు పాళ్ళలో చిలకరించాలి. చివరిగా కట్టె బూడిదను కూడా వేస్తూ విత్తనాలకు లేపనం చేయాలి. ఇలా ఐదు దఫాలుగా చేయాలి. విత్తనం పరిమాణానికి విత్తన గుళికల పరిమాణం 5 రెట్లు పెరుగుతుంది. ఈ విత్తనాన్ని మే వరకు విత్తుకోవచ్చు. ఎకరానికి 400 కేజీల ఘన జీవామృతాన్ని చల్లుకోవాలి. ఆ తర్వాత కనీసం 3 అంగుళాల మందాన వేరుశనగ పొట్టు, కందిపొట్టు, శనగ పొట్టు, గడ్డి తదితర పంట వ్యర్థాలతో పొలం అంతా ఆచ్ఛాదన చేయాలి.

పొలం చదరంగా ఉంటే...(తొలి ఏడాది మాత్రమే) దుక్కి చేసిన తర్వాత ఎద్దుల గొర్రు లేదా సీడ్ డ్రిల్‌తో విత్తన గుళికలను వరుసలుగా విత్తుకోవచ్చు. పొలంవాలు ఎక్కువగా ఉంటే వాలుకు అడ్డంగా బోదెలు చేసుకొని మనుషులే విత్తన గుళికలను వరుసలుగా విత్తుకోవాలి. లేపనం చేసిన విత్తనం 6 నెలలు భద్రంగా ఉంటుంది. భూమిలో వేసిన తర్వాత బట్ట తడుపు వాన (5–10 ఎం.ఎం.) పడినా చాలు మొలుస్తుంది.

ఘన జీవామృతంతో లేపనం చేసినందున మొలక 25–30 రోజుల వరకు వాన లేకపోయినా తట్టుకొని నిలబడుతుంది. ద్రవ జీవామృతం15 రోజులకు ఒకసారి పిచికారీ చేస్తూ ఉంటే... ఇక ఆ పంటకు ఢోకా ఉండదు. 45–50 రోజులకు పిఎండీఎస్ పంటలను కోసి ఆచ్ఛాదనగా వేయాలి. లేదా పశువులకు మేతగా మేపాలి. అంతకుముందే ఖరీఫ్ పంటలను విత్తుకోవాలి.

(సాక్షి సౌజన్యంతో) ■

# సిజేరియన్ శస్త్రచికిత్సలపై ఇక ప్రతిరోజూ ఆడిట్ !

తెలంగాణా రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో అవసరం లేకపోయినా జరుగుతున్న సిజేరియన్ ప్రసవాలపై వైద్యారోగ్య శాఖ సీరియస్ దృష్టిని సారించింది. ఇలాంటి శస్త్ర చికిత్సలను కట్టడి చేసేందుకు కట్టుదిట్టమైన చర్యలకు శ్రీకారం చుట్టింది. ఇక నుంచి ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రతీరోజూ సీ – సెక్షన్ ఆడిట్‌ను తప్పనిసరి చేసింది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వాకాటి కరుణ సిజేరియన్ ఆడిట్ ఫార్మాట్‌ను పంపారు. సిజేరియన్ డెలివరీ చేస్తే అందుకు గల కారణాలను తప్పనిసరిగా ఆ ఆడిట్ ఫార్మాట్‌లో నమోదు చేయాలి.





ప్రతిరోజూ తమ ఆస్పత్రుల్లో జరిగే సీ–సెక్షన్ వివరాలను ఆడిట్ చేసి ప్రభుత్వానికి పంపాలి. కాగా, ఎక్కువగా సిజేరియన్ డెలివరీలు జరుగుతున్న ఆస్పత్రులపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వం జిల్లా కలెక్టర్లను ఆదేశించింది. సిజేరియన్ డెలివరీలను తగ్గించేందుకు వైద్యశాఖ చేసిన సిఫారసులను తప్పనిసరిగా అమలు చేయాలని కోరింది.

అలాగే ఆడిట్‌పై తప్పనిసరిగా నెలవారీగా సమీక్షలు చేయాలని సూచించింది. రాష్ట్రంలోని 40 ప్రభుత్వ ఆస్పత్రుల్లో 61 శాతానికి మించి సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతున్నట్లు వైద్యశాఖ పరిశీలనలో వెల్లడైంది. గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబరు చివరి వరకు వైద్యశాఖ సర్కారీ ఆస్పత్రుల్లో ప్రసవాలపై జరిపిన అధ్యయనంలో ఇది వెల్లడైంది. అందులో మహబూబాబాద్ జిల్లా గూడూరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అత్యధికంగా 88 శాతం జరిగాయి.

ఆ తర్వాత హుజురాబాద్ ఏరియా ఆస్పత్రిలో 87 శాతం, నిజామాబాద్ జిల్లా బాల్కొండలో 84, నిర్మల్ జిల్లా ఖానాపూర్ సీహెచ్‌సీలో 80, వేములవాడ సీహెచ్‌సీలో 78, మంథని సీహెచ్‌సీలో 76, పరకాల సీహెచ్‌సీలో 77 శాతం జరిగాయి. ఏరియా ఆస్పత్రుల విషయానికొస్తే కొత్త గూడెం, జగిత్యాల, జనగామ, కామారెడ్డి, మహబూబాబాద్, ములుగు, నాగార్జున సాగర్, దేవరకొండ, భైంసా, గోదావరిఖని, హుజూర్‌నగర్, సూర్యాపేటలలో సగటున 61 శాతానికిపైగా చోటు చేసుకున్నాయి.

ఇక హైదరాబాద్ కింగ్‌కోఠీ జిల్లా ఆస్పత్రితో పాటు జగిత్యాల, కరీంనగర్, ఖమ్మం, సిరిసిల్ల జిల్లా ఆస్పత్రుల్లో 61 శాతానికిపైగా జరిగాయి. ఇవేకాక మరో 98 సర్కారీ దవాఖానాల్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన సగటు కంటే ఎక్కువగానే జరిగినట్లు తేలింది.

**ప్రత్యేక దృష్టి సారించిన మంత్రి హరీశ్‌రావు**

దేశంలోనే సిజేరియన్ ప్రసవాలు ఎక్కువగా తెలంగాణ లోనే జరుగుతున్నాయి. రాష్ట్రంలో ప్రతీ వంద ప్రసవాల్లో

61 శాతం సిజేరియన్ డెలివరీలే జరుగుతున్నాయి. ఇదే విషయం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5లో కూడా వెల్లడైంది. దీన్ని తీవ్రమైన ఆందోళన కలిగించే అంశంగా వైద్యశాఖ పరిగణించింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్నారు.

రాష్ట్రంలో కడుపు కోతలు తగ్గించేందుకు పకడ్బందీ చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇలాంటి ఆపరేషన్లు ఎక్కువగా జరిగే కరీంనగర్ జిల్లాపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారు. ఆ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేటులో 90 శాతానికిపైగా సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతున్నాయి. దీంతో ఆ జిల్లాపై వరుసగా సమీక్షలు నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల గైనకాలజిస్టులను పిలిచి, ఇలాంటి ఆపరేషన్లను తగ్గించేందుకు సహకరించాలని కోరారు.

**ఆడిట్‌పై వైద్యారోగ్య శాఖ సూచనలివే...**

ప్రతి ఆస్పత్రి విధిగా ప్రతీ రోజూ (ఒకవేళ సిజేరియన్ ఆరోజు చేస్తే) ఆడిట్ నిర్వహించాలి. అత్యవసర పరిస్థితుల్లోనే సిజేరియన్ ఆపరేషన్ ద్వారా ప్రసవం చేయాలి. కేసు షీట్‌లో గర్భధారణ చరిత్ర, ప్రసవ సమయ స్థితి, తదితర అంశాలను రాయాలి. ఆస్పత్రి వారీగా ఒకటి, జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో మరొక కమిటీ ఉండాలి. ఆ కమిటీ ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలి. ఆడిట్ ఫార్మాట్‌ను సిజేరియన్ డెలివరీ చేసిన వైద్యులే నింపాలి.

ఒకవేళ ఆ రోజు ఆడిట్ ఫార్మాట్ నింపలేకపోతే మరుసటి రోజు డ్యూటీకి వచ్చిన వెంటనే ఫిలప్ చేయాలి. అలాగే అందుకు గల కారణాలు రాయాలి. వైద్యుడి అభిప్రాయాలను అందులో జోడించాలి. సిజేరియన్స్‌పై ప్రతీనెలా తప్పనిసరిగా ఆస్పత్రుల స్థాయిలోనే సమీక్ష నిర్వహించుకోవాలి.

ఆడిట్ రిపోర్టును ప్రతినెలా 5వ తేదీ సాయంత్రంలోగా జిల్లా పరిధిలోని ఆస్పత్రులంతా జిల్లా వైద్యారోగ్యశాఖ ఉన్నతాధికారులకు పంపాలి. వారు జిల్లాకు సంబంధించిన సమాచారం అంతా కలిపి ప్రతీ నెలా 10వ తేదీలోగా రాష్ట్ర వైద్యారోగ్యశాఖకు పంపాలి.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ■

## కూతురికోసం చిరుత పులితో తల్లి పోరాటం !

**మ**హారాష్ట్రకు చెందిన జ్యోతి పుపాల్వర్ తన మూడేళ్ల కూతురితోపాటు చంద్రాపూర్ ప్రాంతలోని దుర్గాపూర్ కాంప్లెక్స్‌లో నివాసం ఉంటోంది. కూతురు ఆకలి అనడంతో ఆ చిన్నారికి జ్యోతి అన్నం పెట్టి తన పనిలో నిమగ్నం అయింది. మూడేళ్ల చిన్నారి ఇంట్లో కూర్చుని భోజనం చేస్తుండగా అకస్మాత్తుగా ఇంట్లోకి చిరుత వచ్చింది. దీంతో ఆ చిన్నారి భయంతో కేకలు వేసింది.

కూతురి అరుపులు విన్న జ్యోతి.. చిన్నారి వద్దకు పరుగెత్తుకెళ్లింది. తన కూతురిని చిరుత ఈడ్చుకెళ్లడం చూసి షాకైంది. కర్ర తీసుకుని చిరుతను వెంబడించింది. ప్రాణాలకు తెగించి మరీ దానితో పోరాటం చేసింది. చివరకు కూతురు ప్రాణాలను రక్షించుకుంది. తీవ్రంగా గాయపడ్డ కూతురుని స్థానికుల సహాయంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలించింది.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కర్రతో చిరుత మూతిపై పదే పదే కొట్టినట్టు, దీంతో అది తన కూతుర్ని వదిలేసిందని వెల్లడించారు. చిన్నారిని వదిలేసిన తర్వాత కూడా చిరుతను కర్రతో కొట్టడంతో తిరిగి అది తమపై దాడి చేయకుండా పారిపోయిందని వివరించారు.

ఇక్కడ చిరుత దాడి చేయడం ఇదే తొలిసారి కాదు. ఇప్పటి వరకు ఆరుగురు చిన్నారులు సహా మొత్తం 15 మందిని చిరుత పొట్టన పెట్టుకుంది. ఈ విషయంపై ఫారెస్ట్ అధికారులకు స్థానికులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన వాళ్లు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో తాజాగా మూడేళ్ల చిన్నారిపై దాడి చేసింది.

ఈ ఘటనపట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల వైఖరిని తప్పుబట్టడంతో పాటు.. చిరుతను చంపేయాలని డిమాండ్ చేశారు. ఫారెస్ట్ అధికారులు చిరుతను హతమార్చేందుకు ఆదేశాలు జారీ చేశారు. ■

# సేంద్రియ పెరటి తోటల విప్లవ గ్రామం !

సేంద్రియ పెరటి తోటల విప్లవానికి వెంకట్రాయపురం గ్రామ గృహిణులు శ్రీకారం చుట్టారు. తూర్పుగోదావరి జిల్లా పెరవలి మండలంలో ఓ మారుమూల గ్రామం ఇది. 364 కుటుంబాలు.. 1,566 మంది జనాభా. గతంలో కిలోమీటర్ల దూరం వెళ్ళి కూరగాయలు కొని తెచ్చుకునేవారు. గృహిణు లంతా చైతన్యవంతులై ఐదేళ్ళ క్రితం సెర్ప్ తోడ్పాటుతో సేంద్రియ పెరటి తోటల సాగును నేర్చుకొని ఆచరిస్తున్నారు.

రోడ్ల పక్కన, ఇంటి చుట్టూ, ఖాళీ స్థలాల్లో, గ్రామంలో ఖాళీగా ఉన్న పోరంబోకు స్థలాల్లోనూ కూరగాయ పంటలు, పండ్ల మొక్కలు నాటి, చక్కని ఫలసాయం పొందుతున్నారు. జానెడు జాగా ఉందంటే అందులో ఏదో ఒక కూరగాయ మొక్క ఉండవలసిందే. డాబా ఇళ్ళపై, ఇళ్ల చుట్టూ పంట మొక్కలతో ఆ గ్రామం కళకళలాడుతూ కనిపిస్తున్నది.

ప్రతీ ఇంటి వద్ద వంగ, బెండ, టమాటా, బీర, పొట్ల, ఆనప, గుమ్మడి, బూడిద గుమ్మడి, మునక్కాడలు, తోటకూర, పాలకూర, చుక్కకూర, మెంతికూర, గోంగూరతో పాటు కంద కూడా ఇళ్ల వద్దే సాగు చేసుకుంటున్నారు. జామ, బొప్పాయి, నారింజ, పంపరపనస, సపోటా, దానిమ్మ వంటి పండ్ల మొక్కలు నాటారు. అవి ఇప్పుడు ఫలసాయం అందిస్తు న్నాయి. రెండేళ్ళ క్రితం గ్రామంలో ఒక ద్రాక్ష పాదును నాటారు. ఇప్పుడు గ్రామంలో 50 శాతం ఇళ్లలో ద్రాక్ష పాదులు పండ్లను అందిస్తున్నాయి. మహిళల్లో వచ్చిన చైతన్యం ఫలితంగా ఇప్పుడు ఏ ఇంటికి వెళ్ళినా అనేక రకాల కూరగాయలు కనిపిస్తున్నాయి. ఎవరికి వీలైన పంటలు వారు తమ పెరట్లో పండిస్తున్నారు.

తాము ఇంటిపట్టున పండించిన కూరగాయలు, పండ్లను డబ్బు ప్రమేయం లేకుండా ఇరుగు పొరుగు వారికి ఇచ్చిపుచ్చు కుంటూ ఆదర్శంగా జీవిస్తున్నారు. తాము సేంద్రియంగా పండించిన కూరగాయాలు, ఆకుకూరలు, పండ్లు తినటం వల్ల అందరం ఆరోగ్యంగా ఉన్నామని మహిళలు సంబరంగా చెబుతున్నారు. కుల మతాలకు అతీతంగా కలిసి మెలసి పనులు చేసుకుంటారు. ఒకటే మాట, ఒకటే బాట అన్నట్లు జీవిస్తుండటం విశేషం.

**కూరగాయలన్నీఉచితమే**

ఈ గ్రామానికి కొత్త కోడలిని. కూరగాయల దుకాణాలు ఏమీ లేవు. ఏం వండుకోవాలో తెలిసేది కాదు. ప్రతీ ఇంటి వద్ద కూరగాయలు పండించడంతో ఇప్పుడు కూరగాయల కొరత బాధ లేదు. ఏ కూరగాయలు కావాలన్నా ఇక్కడే ఉచితంగా దొరుకుతున్నాయి. ***– బోళ్ళ నాగమణి***

**ప్రతి ఇంటి పరిసరాల్లోనూ...**

గ్రామస్థులు కూరగాయల కోసం పడుతున్న ఇబ్బందుల గురించి ఉన్నతాధికారుల వివరించాను. సుస్థిర వ్యవసాయం ద్వారా కూరగాయల సమస్యను తీర్చవచ్చని, అందుకు ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ఆ మేరకు మహిళలందరినీ చైతన్యపరిచి సామూహిక కూరగాయల సాగు చేయించాను. ఇప్పుడు ఏ ఇల్లు చూసినా కూరగాయ పంటలతో కళకళలాడుతూ కనిపిస్తున్నది. ప్రభుత్వం 90 శాతం సబ్సీడీపై విత్తనాలు సరఫరా చేసింది. రోడ్ల పక్కన, పోరంబోకు స్థలాల్లో కూడా కూరగాయ పంటలు పండిస్తున్నారు.

***– పాటిఅనంతలక్ష్మి (93909 72585), వివిఏ,***

**సమష్టి నిర్ణయాలు తీసుకుంటాం**

గ్రామం చిన్నది. పంచాయతీ ఆదాయం ఏడాదికి రూ. 70వేలు మాత్రమే. ఉన్నదాంట్లో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నాం. గ్రామస్తులందరం కలసి నిర్ణయాలు తీసు కుంటాం. ప్రతి ఇంటి వద్దా కూరగాయలు సాగు చేస్తున్నారు. ఎవరికి ఏ కూరగాయలు కావాలంటే అవి ఉన్న ఇంటి దగ్గరకు వెళ్ళి తెచ్చుకుంటారు. కుల మత భేదాలకు తావు లేదు. అనారోగ్యాల్లేకుండా ఆరోగ్యంగా జీవిస్తున్నాం.

***– పోలిశెట్టి బాలాజీ (93164 44777), సర్పంచ్***

(సాక్షి సౌజన్యంతో) ■

# ఇంట్లోనే కూరగాయలు సాగు చేద్దాం!

పచ్చదనం ఎక్కడైనా అందమే, ఆనందమే, ఆరోగ్యమే. మన ఇంటి ఆవరణలోనే ఎంచక్కా ఆకుకూరలు, కూరగాయలను పండించుకోవచ్చు. ఇంతకీ ఇంటి ముందు పెరడులో కూరగాయలను పెంచాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? ఆ విశేషాలివి...

- ఎంత స్థలం ఉందనేది ఇక్కడ ముఖ్యం కాదు..... ఆ ప్రాంతంలో సూర్యరశ్మి పడుతుందా? లేదా? అనేదే చూసుకోవాలి.
- ఉన్న స్థలంలో గడులుగా చేసుకుని నల్లరేగడి మట్టి, ఎర్రమట్టిని వేయాలి. పశువుల పేడను వేయటం మంచిది. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు వేస్ట్‌ను కూడా ఆ నేలలో వేయొచ్చు. కుళ్లిన ఆ పదార్థాలే ఎరువుగా ఉపయోగపడతాయి.
- ముఖ్యంగా ఆకుకూరలు, కూరగాయలు వేయాలనుకున్న రెండు, మూడు రోజుల ముందు ఆ స్థలంలో నీరు పెట్టాలి. నీటిశాతం ఉన్నప్పుడు ఎంపిక చేసుకున్న గింజలను వేయాలి.
- ఏ కాలమైనా సరే కొత్తిమీర, పుదీనా, ఆకుకూరల్ని పెంచుకోవచ్చు. ఈ ఎండాకాలంలో అయితే సరైన సమయంలో నీళ్లు పట్టి.. కాస్త జాగ్రత్తగా చూసుకో గలిగితే చాలు ఆరోగ్యకరమైన ఆకుకూరలను తినొచ్చు.
- ఎండాకాలంలో చిక్కుడు, సొరకాయ, గోరుచిక్కుడు, బీర, దొండ, బెండ, దోస పండించుకోవచ్చు. చలి కాలంలో క్యారెట్, టొమాటో, బీన్స్‌ను పండించొచ్చు.
- వేపనూనె నీళ్లలో కలిపి పిచికారి చేస్తే తెగుళ్లు పోతాయి. మన పెరటితోట ఆకుకూరల్ని, కూరగాయలను తినొచ్చు. ఉన్న స్థలంలో రెండు కరివేపాకు చెట్లు వేసుకుంటే ఎంతో మంచిది.
- ఇంటి దగ్గర స్థలం అందుబాటులేని పట్టణ, నగర ప్రాంతాల్లోని వాళ్లు మిద్దెతోట, కుండీల్లో కూడా కూరగాయలు, ఆకుకూరలు పండించుకోవచ్చు. ఇందుకోసం మీకు తెలిసిన మిద్దెతోట నిపుణులను సంప్రదించి సలహాలు తీసుకోవచ్చు. ఏది ఏమైనా మన సొంత స్థలంలో ఆకుకూరలు, కూరగాయలను పండించి తినటంలో ఉండే మజానే వేరు. ■

## కాలుష్యంతో భారత్‌లో అత్యధిక అకాల మరణాలు!

భారత్‌లో కాలుష్యం కారణంగా 2019లో దాదాపు 23.5 లక్షలకు పైగా అకాల మరణాలు చోటు చేసుకున్నాయని ది లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ జర్నల్ తాజాగా వెల్లడించింది. ఇవి ప్రపంచంలోనే అత్యధికమని పేర్కొంది. వీటిలో 6.1లక్షల మరణాలు గృహాల నుంచి వచ్చే కాలుష్యం వలన సంభవించాయని వెల్లడించింది. "ప్రపంచవ్యాప్తంగా అన్ని రకాల కాలుష్యాలు కలిపి 90 లక్షల అకాల మరణాలు 2019లో చోటు చేసుకున్నాయి. 2000 సంవత్సరంతో పోలిస్తే ఇది 55 శాతం అధికం.

ఇక నీటి కాలుష్యం వలన ప్రపంచవ్యాప్తంగా 13.6 లక్షల మంది కన్నుమూశారు. కాలుష్యం కారణంగా చోటు చేసుకుంటున్న నష్టాలు అపారంగా ఉన్నాయి. ఒక్క 2019లోనే అకాల మరణాల వలన కలిగిన నష్టం రూ. 3.5 కోట్ల కోట్లు. అయినప్పటికీ ఈ విషయానికి అంతర్జాతీయ అభివృద్ధి అజెండాలో పెద్దగా ప్రాధాన్యం లభించడం లేదు. భారత్‌లో ఉత్తరభారత రాష్ట్రాల్లో తీవ్ర స్థాయిలో కాలుష్యం ఉంది. భారత్‌కు కాలుష్య నియంత్రణకు ఒక బలమైన కేంద్రీకృత యంత్రాంగ వ్యవస్థ లేదు" అని అధ్యయనంలో పరిశోధకులు వెల్లడించారు. జాబితాలో భారత్ తొలిస్థానంలో ఉండగా.. చైనా (22 లక్షల మరణాలు) రెండవ స్థానంలో ఉంది. ■

# కుంగిపోయే రైతు కన్నీళ్ళు తుడిచే 'కిసాన్ మిత్ర'!

"మాకు ఒక్కోరోజు రైతుల నుంచి రెండు వందల ఫోన్‌కాల్స్ కూడా వస్తుంటాయి. ఒక్కొక్కరిదీ ఒక్కో సమస్య. కొందరైతే, మమ్మల్ని ప్రభుత్వ ఉద్యోగులు అనుకొని తిట్లదండకం తోనే తమ సమస్యలు ఏకరువు పెడుతుంటారు. అయినా, వాళ్లనెన్నడూ మేము పల్లెత్తుమాట అనం. ఎంత కష్టంలో ఉంటే, వారంత కోపంతో మాట్లాడుతున్నారో అనుకుంటాం! కుంగుబాటుతో ఫోన్ చేసిన అన్నదాతలకు మాటలతో ధైర్యం చెప్పేందుకు ప్రయత్నిస్తాం. రెవెన్యూ, పంట రుణాలు, రాయితీలు, నకిలీ విత్తనాలు వంటి సమస్యలైతే కిసాన్ మిత్ర వలంటీర్ల చొరవతో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళతాం. అవి పరిష్కారమయ్యేంత వరకు కృషి చేస్తాం. అలా ఈ ఏడేళ్లలో కొన్ని వేల మంది రైతుల బాధలు విన్నాం. వాళ్లకు మా వంతు సహకారం అందించగలిగాం.



ఒకరోజు అనంతపురం జిల్లా నల్లమాడ మండలంలోని ఒక గ్రామం నుంచి ఓ రైతు కూతురు ఫోన్ చేసి, తన తండ్రి పురుగుల మందు తాగబోతుండగా చూసి అడ్డుకున్నానని చెబుతూ, బోరున ఏడ్చింది. ఆ వెంటనే అతనికి ధైర్యం చెప్పడంతో పాటు అసలు సమస్య గురించి తెలుసుకున్నాం. ముగ్గురు కూతుళ్ల పెళ్లి ఖర్చుతో అప్పులపాలైన ఆ రైతు, తనకున్న రెండు ఎకరాలను అమ్ముదామనుకున్నాడు. కానీ అన్నదమ్ములు అడ్డుపడటంతో కేసు కోర్టు వరకూ వెళ్లినా, ఇతనే గెలిచాడు. అయినా, రెవెన్యూ అధికారులు హోల్డులో పెట్టడంతో అమ్ముకోలేకపోతున్నాడు. అప్పులవాళ్లు రోజూ ఇంటికొచ్చి అనరాని మాటలతో అవమానిస్తుండటంతో చనిపోవాలని అనుకున్నట్టు చెప్పాడు. అప్పటికప్పుడు మా కార్యకర్త సంబంధిత అధికారులకు కోర్టు ఆర్డరు చూపించి, నిలదీయడంతో సమస్య సమసి పోయింది. ఇప్పటికి అతను అప్పుడప్పుడూ ఫోన్ చేసి పలకరిస్తుంటాడు. ఇలాంటి కేస్ స్టడీస్ మమ్మల్ని మరింత ఉద్యుక్తుల్ని చేస్తాయి. అలా ఈ ఏడేళ్లలో ఎంతో మందిని కిసాన్ మిత్ర కాపాడింది.

**బాధించిన ఘటనలు...**

ఇన్నేళ్ల అనుభవంలో మమ్మల్ని తీవ్రంగా బాధించిన ఫోన్‌కాల్స్ కూడా కొన్నున్నాయి. అందులో ఒకటి... చేతికంది వచ్చిన ఒక్కగానొక్క కొడుకును రోడ్డు ప్రమాదంలో పోగొట్టుకున్న ఒక అవిటి తండ్రి, ప్రమాద బీమా కోసం మూడేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం దక్కలేదు. ఆ ఘటన మా మనసుల్ని ఇప్పటికీ మెలి పెడుతుంది. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలానికి చెందిన అతను ఎప్పుడు ఫోను చేసినా, తనకి మేము ఏమీ చేయలేక పోతున్నామని గిల్టీగా అనిపిస్తుంది.

మరొక కేసులో అప్పులబాధ భరించలేక తండ్రి ఆత్మహత్య చేసుకుంటే, ఆ పరిహారం చేతికి అందితే బాకీలు తీరుద్దామని నాలుగేళ్లుగా ఎదురు చూసినా, అతని కొడుకు కూడా అప్పులోళ్ల ఒత్తిడి భరించలేక చివరికి ఉసురుతీసుకున్న ఘటన మాకు కొద్దిరోజుల పాటు నిద్ర లేకుండా చేసింది. రైతు ఆత్మహత్య కుటుంబాలకు పరిహారం అందడంలో ప్రభుత్వ యంత్రాంగం చాలా జాప్యం చేస్తుంది. కొన్ని కేసుల్లో అయితే, విచారణకు వచ్చినప్పుడు ఇంట్లో మనుషులు లేరని తిరస్కరిస్తున్నారు. అధికారులు వస్తారని, ఇళ్ల వద్దే రైతులు కూర్చోరు కదా.! బడ్జెట్టు లేదనే కారణంగా పరిహాం ఇవ్వని కేసులూ బోలెడున్నాయి. ఈ సమస్య మీద రెండు రాష్ట్రాల నుంచి మాకు చాలా ఫిర్యాదులు వస్తున్నాయి.

**జీవనోపాధి చూపిస్తూ...**

రైతు ఆత్మహత్య కుటుంబాల్లోని ఒంటరి మహిళలకు కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో 'కిసాన్ మిత్ర' జీవనోపాధి మార్గాలనూ చూపిస్తుంది. అలా అప్పటి కలెక్టరు

దివ్యాదేవరాజన్ సహకారంతో వికారాబాద్ జిల్లాలోని 150 మందికి సహాయం చేయగలిగాం. మంచిర్యాలలోని మరో పాతికమందికి తోడ్పడగలిగాం. రైతు ఆత్మహత్య కుటుంబాల లోని శారద, నిర్మల అనే ఇద్దరు మహిళలకు ఇల్లు గడవడమే కష్టంగా మారిందని మా దృష్టికొచ్చింది. వాళ్లు ఎన్నిసార్లు దరఖాస్తు చేసినా, పరిహారం అందలేదు. అందుకు కారణాలు తెలియరాలేదు. మావంతుగా వాళ్లిద్దరితో చిన్నపాటి వస్త్ర దుకాణం పెట్టించాం. అలా గేదెలు కొనివ్వడం, బడ్డీకొట్టు, కుట్టుమిషను వంటి జీవనోపాధికి అవసరమైన అర్థిక సహాయం అందిస్తున్నాం. ఆంధ్రాలో ఒక రేషన్ కార్డుకు ఒకటే పింఛను విధానాన్ని అమలు చేయడం వల్ల, ఒకే కుటుంబంలోని వితంతువులైన అత్త, కోడళ్లు చాలా ఇబ్బంది పడుతున్నట్టు మా దృష్టికొచ్చింది. వితంతువులకు ఇచ్చే పింఛను విషయంలో ఇలాంటి సంకుచిత నిబంధన పెట్టడం సరికాదు కదా.! మన ప్రభుత్వ విధాన కర్తలకు సున్నితంగా ఆలోచించడం ఎప్పుడు తెలుస్తుందో.! ఏమో.!

**ఆంధ్రప్రదేశ్ నుంచి...**

ఏపీ నుంచి మాకు వచ్చే ఫోన్‌కాల్స్‌లో ఎక్కువగా... ఉపాధి హామీ పథకానికి బిల్లులు, వేతనాలు అందడం లేదని చాలామంది రైతులు చెబుతున్నారు. అదేమని అధికారులను అడిగితే, నిధుల కొరత అంటున్నారు. 'మీ భూమి' నమోదు పోర్టల్‌లో ఒకరి వ్యవసాయ భూమి సర్వే నెంబర్లు మరొకరికి వేయడం. కొన్ని సర్వే నెంబర్లు అస్సలు కనిపించకపోవడం. కొందరు రెవెన్యూ అధికారులు డబ్బులు తీసుకొని సర్వే చేయకుండానే ఒకరి పొలాన్ని మరొకరి పేరుమీద ఆన్‌లైన్‌లో నమోదు చేయడం వంటి సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. చాలాచోట్ల ఎమ్మార్వోల డిజిటల్ సిగ్నేచర్లు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసింది. కౌలు రైతు గుర్తింపు కార్డులు ఇవ్వక పోవడం వంటి సమస్యలు ఎక్కువగా మా దృష్టికి వస్తున్నాయి.

**తెలంగాణ నుంచి...**

మూడేళ్లుగా కొత్త పింఛన్లు మంజూరు చేయలేదు. రిజిస్ట్రేషన్ ఫీజు పెంచడం. ఆన్‌లైన్‌లో నాలుగు వందల ఎకరాలుంటే, వాస్తవంగా మూడువందల ఎకరాలే ఉండటం. ధరణిలో సర్వే నెంబర్ల తారుమారు. స్లాట్ రద్దుచేసుకున్న తర్వాత, ఆ డబ్బును తిరిగి ఇవ్వకపోవడం. పాస్‌బుక్‌లోని తప్పులను సరిచేసుకునేందుకు సరైన సౌలభ్యం లేకపోవడం. పంట రుణాలు ఇవ్వడంలో జాప్యం. బ్యాంకుల చుట్టూ రోజుల తరబడి రైతులను తిప్పుకోవడం. సహకార బ్యాంకుల్లో అసైన్డ్ భూములమీద రుణాలు ఇవ్వకపోవడం వంటి సమస్యల మీద ఎక్కువ ఫోన్లు వస్తుంటాయి.

**సహనంతో సమాధానం...**

ఇలా రకరకాల సమస్యలతో మమ్మల్ని సంప్రదించే రైతులకు అర్థమయ్యేరీతిలో సమాధానమివ్వడం మా బాధ్యత. అందుకు చాలా సహనం అవసరం. అది మా ముగ్గురికి పుష్కలంగా ఉంది. మేము ఓపికతో చెప్పే సమాధానం ఒక ప్రాణాన్ని నిలబెడుతుంది అనే విషయం మాకు ప్రతిక్షణం గుర్తుంటుంది. వ్యవసాయంలో మహిళల పాత్ర ప్రధానం. అలాంటిది మాకు ఆడవాళ్ల నుంచి ఫోన్‌కాల్స్ చాలా చాలా తక్కువ వస్తుంటాయి. భూమి, రెవెన్యు, పంట రుణాలు, బ్యాంకు వ్యవహారాలు తదితర అంశాలమీద ఆడవాళ్లకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత మగవాళ్లదే. ఇదే విషయాన్ని కాలర్స్‌కు పదే పదే గుర్తుచేస్తుంటాం.

## కిసాన్ మిత్ర చొరవతో...

**రూ**రల్ డెవలప్‌మెంట్ సర్వీసు సొసైటీ, వివిధ సామాజిక, ప్రజా సంఘాలు కలిసి రైతుల సమస్యలమీద పని చేస్తున్న క్రమంలో వికారాబాద్ జిల్లా అప్పటి కలెక్టరు దివ్యదేవరాజన్ ప్రోత్సాహంతో 2017లో 'కిసాన్ మిత్ర' హెల్ప్‌లైన్ ప్రారంభమైంది. తర్వాత ఆదిలాబాద్, మంచిర్యాల, ఉమ్మడి కడప తదితర జిల్లాల్లో గ్రామ తస్థాయి వలంటీర్ల శిక్షణతో సేవలు మరింత విస్తృతమయ్యాయి.

సాధారణ హెల్ప్‌లైన్‌కు భిన్నంగా సమస్య తీవ్రత ఆధారంగా ప్రాధాన్యత ఇస్తూ, కిసాన్‌మిత్ర పని చేస్తోంది. తద్వారా సుమారు 50 వేల మందికి పంట నష్టపరిహారం అందింది. 5000మంది కౌలు రైతులకు రుణ అర్హత గుర్తింపు కార్డులొచ్చాయి. రైతు ఆత్మహత్య కుటుంబాల్లోని 200మంది ఒంటరి మహిళలకు జీవనోపాధి లభించింది. కిసాన్‌మిత్ర కార్యకర్తల సమిష్టి కృషితోనే ఇది సాధ్యమైంది. ■

# పక్షుల సంరక్షణ కోసం పదివేల సైన్యం!

**తనకు ఎంతో ఇష్టమైన పక్షులు కళ్ళముందే అంతరించిపోవడం చూసి ఆమె కలత చెందారు. వాటి పరిరక్షణ కోసం ఉద్యమించారు. ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఇప్పుడు వేలాది మహిళలు ఆమె వెంట నడుస్తున్నారు. ఆమె జీవితం గురించీ, సేవల గురించీ ఈ మధ్యే 'నేషనల్ జాగ్రఫిక్ ఛానల్' ప్రసారం చేసింది. అసోంకు చెందిన పూర్ణిమా దేవి బర్మన్ స్ఫూర్తిమంతమైన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే....**

-----------

"మాది అసోం రాష్ట్రంలోని పబ్ మజిర్‌గావ్ గ్రామం. నా చిన్నప్పుడు మా ప్రాంతం పచ్చని చెట్లతో కళకళలాడేది. ఎన్నో పక్షులు కిలకిలలాడుతూ తిరిగేవి. ముఖ్యంగా దాదాపు అయిదడుగుల పొడుగు ఉండే బెగ్గురు (గ్రేటర్ అడ్జటెంట్) కొంగలు నన్ను బాగా ఆకర్షించేవి. వాటిని అస్సామీ భాషలో 'హర్గిలా' అంటారు. జువాలజీలో ఎకాలజీ, వైల్డ్ లైఫ్ బయాలజీ స్పెషలైజేషన్లతో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసిన తరువాత... బెగ్గురు కొంగల మీద పిహెచ్‌డి చేద్దామనుకున్నాను. ఆ కొంగలు దక్షిణ ఆసియాలో ... ప్రధానంగా భారతదేశం, కంబోడియాల్లో మాత్రమే కనిపిస్తాయి. మన దేశంలో కూడా అసోం, బిహార్ రాష్ట్రాల్లోని కొన్ని చోట్ల మాత్రమే ఇవి ఉంటాయి.



అయితే... పిహెచ్‌డి కోసం వివరాలు సేకరిస్తున్నప్పుడు... బెగ్గురు కొంగలు అంతరించిపోయే స్థితిలో ఉన్నాయనీ, 'ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్' (ఐయుసిఎన్) రూపొందించిన 'తీవ్రమైన ముప్పు ఎదుర్కొంటున్న జీవజాతుల రెడ్ లిస్ట్'లో అవిచోటు చేసుకున్నాయనీ తెలిసింది. ఈ వివరాలు నన్నెంతో కలవరపరిచాయి. పిహెచ్‌డి సంగతి తరువాత... ముందు ఈ పక్షులను కాపాడాల్సిన అవసరం ఉందనుకున్నాను.

**దుశ్శకునం అన్నారు...**

బెగ్గురు కొంగలు ఉండే ప్రాంతాలకు తిరిగిన తరువాత... చెట్ల నరకివేత దీనికి ప్రధాన కారణం అని తెలిసింది. ఒకచోట చెట్టు నరికేసినప్పుడు... కొంగ పిల్లలతో ఉన్న గూళ్ళు నేల మీద పడిపోయిన దృశ్యం చూసి నాకు కన్నీరు ఆగలేదు. ఒక తల్లిగా ఆ పక్షి పిల్లల వేదన నాకు అర్థమైంది. వాటి పట్ల కనీసమైన కనికరాన్ని ఎవరూ చూపించకపోవడం అన్యాయం అనిపించింది. మరోవైపు పక్షులకు అవసరమైన నీటి వనరులు కూడా అంతరించిపోతున్నాయి. మొత్తంగా పర్యావరణ విధ్వంసం ఇటువంటి అరుదైన పక్షులు కనుమరుగైపోవడానికి కారణమవుతోంది. అవి ఈ భూమి మీద మిగలాలంటే... స్థానికంగా ఉండే ప్రజల సహకారం, భాగస్వామ్యం ఎంతో అవసరం. ఈ విషయం మీద చైతన్యం కలిగించాలనుకున్నాను. అసోంలోని ఎన్నో గ్రామాలు తిరిగాను. ఆ పక్షుల ప్రాధాన్యం గురించీ, చెట్లనూ, వనరులనూ కాపాడుకోవడం గురించీ ప్రజలకి వివరించడానికి ప్రయత్నించాను. కానీ నా మాటల్ని గ్రామీణులు పట్టించుకోలేదు. బెగ్గురు కొంగల నుంచి దుర్వాసన వస్తుంది కాబట్టి అవి దుశ్శకునం అని వాళ్ళ అభిప్రాయం. అయితే నేను వదిలిపెట్టలేదు.

పర్యావరణాన్ని ఆ పక్షులు శుభ్రపరుస్తాయనీ, అవి మన సంస్కృతిలో భాగమనీ వాళ్ళకి చెప్పాను. క్రమంగా మహిళలు స్పందించారు. కొంతమందితో కలిసి 'హర్గిలా ఆర్మీ'ని ప్రారంభించాను. కొద్దికాలంలోనే అది ఒక ఉద్యమంగా మారింది. అసోంలోని అనేక ప్రాంతాలకు వ్యాపించింది. ఇప్పుడు మా సైన్యంలో పదివేలమందికి పైగా మహిళలు ఉన్నారు. వారంతా పక్షుల్నీ, పర్యావరణాన్నీ పరిరక్షించడంతో

**వేధింపు మితిమీరితే ఎంత చిన్న ప్రాణి అయినా తిరగబడుతుంది**

పాటు సాధికారత దిశగా పయనిస్తున్నారు. ఇంతకీ వీళ్ళందరూ సాధారణ గృహిణులే. వారు ఒకరికొకరు సాయం చేసుకుంటారు. విద్య, పొదుపు ప్రాధాన్యం గురించి కూడా వీరిలో చైతన్యం కలిగిస్తున్నాం.

**27 నుంచి 250కి...**




ప్రస్తుతం బెగ్గరు కొంగలు ప్రపంచం మొత్తం మీద 1,200 మాత్రమే ఉన్నాయని అంచనా. అసోం ప్రాంతంలో కొన్నేళ్ళ కిందట ఈ కొంగల గూళ్ళు 27 మాత్రమే ఉండేవి. ఇప్పుడు అవి 250కి పెరిగాయి.

'హర్గిలా ఆర్మీ' సాధించిన ఘనత ఇది. మేము చేపట్టిన కార్యం ఒక నిరంతర ప్రక్రియ. ఎత్తుగా ఏర్పాటు చేసిన మంచెల మీద నుంచి... ఎక్కడైనా చెట్ల నరికివేత జరుగుతోందేమో గమనిస్తూ ఉంటాం. నేను దాదాపు ప్రతిరోజూ ఏదో ఒక గ్రామంలో పర్యటించి, అక్కడ ఉన్న సభ్యులతో మాట్లాడతాను. ఆ ప్రాంతంలో పరిస్థితుల గురించి తెలుసుకుంటాను.

వన్య ప్రాణుల మీద రచనలు చేయడం, ఫొటోగ్రఫీ నా హాబీలు. దాదాపు పదిహేనేళ్ళుగా సాగిస్తున్న ఈ కృషికి గుర్తింపుగా... 2017లో 'నారీ శక్తి' పురస్కారాన్నీ, అలాగే యుకెకి చెందిన ప్రతిష్టాత్మక 'వైట్లీ అవార్డు'నూ అందుకున్నాను. దేశ, విదేశాల్లో ఎన్నో సదస్సుల్లో ప్రసంగించే అవకాశం లభించింది. ఈ మధ్య నా జీవితం గురించీ, నేను చేస్తున్న కార్యక్రమాల గురించీ 'నేషనల్ జాగ్రఫిక్ ఛానెల్'లో... 'ఛేంజ్ ఫర్ ఒన్ క్యాంపెయిన్'లో భాగంగా ప్రసారం చేశారు. ఇది నాకు మాత్రమే కాదు... హర్గిలా పక్షికీ, మా సైన్యానికీ, మా ప్రాంతానికీ దక్కిన గౌరవం. పక్షులనూ, పర్యావరణాన్నీ పరిరక్షించేలా మరికొందరికి మా ప్రయత్నం స్ఫూర్తి కలిగిస్తుందనుకుంటున్నాను. అంతకన్నా నేను కోరుకొనేది మరేదీ లేదు.

(ఆంధ్రజ్యోతి) ■



## వనజీవి రామయ్య పెద్దమనసు !

**ప**ద్మశ్రీ అవార్డు గ్రహీత, 'వనజీవి' దరిపల్లి రామయ్య 18-05-22న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ద్విచక్రవాహనంపై ఇంటి నుంచి బయల్దేరిన ఆయన రోడ్డు దాటుతుండగా ఎదురుగా వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. స్థానికులు వెంటనే ఆయన్ను ఖమ్మం జిల్లా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు తక్షణ వైద్య చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లిలో రామయ్య రోజూ ఉదయాన్నే తన ద్విచక్ర వాహనంపై వెళ్లి రహదారుల వెంట ఉన్న మొక్కలకు నీరుపోసి, అనంతరం పెద్ద వృక్షాల నుంచి రాలిన విత్తనాలను సేకరిస్తుంటారు. ప్రమాద ఘటన, రామయ్య ఆరోగ్యంపై సీఎం కేసీఆర్ ఆరా తీశారు. ఎంపీ సంతోష్ కుమార్ ద్వారా ఆస్పత్రి ఏవోకు ఫోన్ చేయించిన సీఎం.. రామయ్య ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. గాయపడిన రామయ్యకు మెరుగైన వైద్యం అందించాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వైద్యాధికారులను, వైద్యులను ఆదేశించారు.

**వాహనదారుడిపై ఫిర్యాదు చేయొద్దు**

రామయ్యప్రమాద ఘటనపై వనజీవి రామయ్య కుటుంబ సభ్యులు ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే, తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో ఉన్న రామయ్య తనను ఢీకొట్టి గాయపడడానికి కారణమైన వాహనదారుడిని క్షమించడంతో పాటు మొక్కలపై తనకున్న ప్రేమను మరోసారి చాటుకున్నారు. అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేయవద్దని, తనను ఢీకొట్టిన ఆ వాహనదారుడు వంద మొక్కలునాటి, వాటిని సంరక్షిస్తే చాలని తన కుటుంబ సభ్యులకు రామయ్య సూచించినట్లు తెలిసింది. ■

# తెలంగాణాలో ఉచితంగా మోకాలి చిప్పల మార్పిడి !

**వయస్సు పైబడిన కొద్దీ అడుగుతీసి అడుగు వెయ్యడం కుదరని పరిస్థితి. మోకీళ్ల సమస్యతో కూర్చోలేక.. నడవలేక పడే బాధ వర్ణనాతీతం. ఆపరేషన్లు చేసుకుందామంటే ప్రైవేటు దవాఖానల్లో లక్షల రూపాయలు ఖర్చు. ఆర్థికంగా వెనుకబడిన వారికి, పేదోళ్లకు ఈ సమస్య ఎదురైతే చెప్పలేని బాధ. అలాంటి వారి బాధలు పూర్తిగా తీర్చేందుకు తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. సర్కారు దవాఖానాల్లోనే మోకాళ్ల చిప్పల మార్పిడి ఆపరేషన్లు చేయిస్తూ అందుకు అయ్యే ఖర్చును భరిస్తున్నది. నిజామాబాద్ జిల్లా కేంద్ర ప్రభుత్వ దవాఖానలో తాజాగా ముగ్గురికి మోకీళ్ల ఆపరేషన్లను వైద్య బృందం విజయవంతంగా నిర్వహించింది.**

**తె**లంగాణ ప్రభుత్వం వచ్చాక వైద్య సేవల్లో సమూల మార్పులు వచ్చాయి. 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అన్ని నానుడి నుంచి 'నేను వస్తా బిడ్డో సర్కారు దవాఖానకు' అన్నట్లుగా పరిస్థితి మారింది.

ఒకప్పుడు నమ్మకం లేని వైద్య సేవలతో పేదలు, మధ్యతరగతి వర్గాలు అటువైపు కన్నెత్తి చూడాలంటే భయపడేవి. ఇప్పుడు సంపన్న కుటుంబాలకు చెందినవారు కూడా ప్రభుత్వ సేవలను అంది పుచ్చు కుంటున్నారంటే అతిశయోక్తి కాదు.

మెడికల్ కాలేజీ అందుబాటులోకి వచ్చాక నిజామాబాద్ వాసులకు అత్యాధునిక వైద్య సేవలు దరిచేరాయి. విభిన్న విభాగాల్లో వైదకయ నిపుణులు అందుబాటులో ఉండడంతో హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరమే లేకుండా పోయింది.

కరోనా సమయంలో అమ్మలా ఆదుకున్న ప్రభుత్వ జనరల్ దవాఖాన.... ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వ చొరవతో మోకాళ్ళ మార్పిడి చికిత్సల కేంద్రంగా మారబోతున్నది. మాతృదినోత్సవం సందర్భంగా విజయవంతంగా ముగ్గురు మహిళలకు మోకీలు శస్త్రచికిత్సల కేంద్రంగా మారబోతున్నది. మాతృదినెత్సవం సందర్భంగా విజవయంతంగా ముగ్గురు మహిళలకు మోకీలు శస్త్రచికిత్సలు పూర్తి చేయగా ఇదే స్ఫూర్తితో మున్ముందు మరింతమందికి సేవలు అందించేందుకు సంబంధిత విభాగం డాక్టర్లు సిద్ధంగా ఉన్నారు.

**కూర్చోలేరు.. నడువలేరు.**

మోకాళ్ళ నొప్పి సమస్యతో బాధపడేవారిలో గ్రామీణ ప్రాంతానికి చెందినవారే అధికం. పట్టణాల్లో అధునాతన సౌకర్యాలు రావడంతో మోకాళ్ళ సమస్యకు తాత్కాలిక విరుగుడుతో రోజులు గడిపేస్తారు. కానీ పల్లెల్లో కూర్చోలేక, నడువలేక మోకీళ్ళ సమస్యలు ఎదుర్కొనే వారి బాధ వర్ణనాతీతం. వయసు పెరిగేకొద్దీ శారీరకంగా అనేక మార్పులు చోటు చేసుకుంటాయి. మరింత జాగ్రత్తగా జీవనశైలిని అలవర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడుతుంది. ప్రధానంగా కీళ్లలో అరుగుదల మొదలవుతుంది.

ఎక్కువ శాతం 45 ఏండ్లు పైబడిన వారిలోనే మోకాళ్ళ సమస్య ఉత్పన్నమవుతుంది. వందలో 40 మందికి పైగా మోకాళ్ళ నొప్పులతో ఇబ్బందిపడుతున్నట్లు వైద్య నిపుణులు చెబుతున్నారు. వృత్తిపరంగా, రోజువారీ చేసే పనుల ఆధారంగా, ఇతరత్రా కారణాలతో మోకాళ్ళలో అరుగుదల ఆరంభం అవుతుంది. తీవ్రగాయాలైన సందర్భంలో వయసుతో సంబంధం లేకుండా ఆ ప్రభావం చూపుతున్నది. అరుగుదల మొదలైన తర్వాత లక్షణాలు క్రమంగా బయటపడుతుండగా తీవ్రమైన నొప్పి, కొన్నిసార్లు నడవలేని పరిస్థితి ఎదుర్కొనేవారు అనేకం. అలాంటి వారికి బాసటగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావు ప్రత్యేక

**సమస్యను చూసి భయపడితే అది రెట్టింపు భయపెడుతుంది, పట్టించుకోకపోతే పలాయనమవుతుంది**

చొరవతో మోకీళ్ళ ఆపరేషన్లు ఇప్పుడు నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ దవాఖానలో అందుబాటులోకి వచ్చాయి.

**ప్రైవేటులో రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల ఖర్చు..**

మోకాళ్ల నొప్పుల సమస్య మొదటి, రెండు దశల్లో సాధారణ నొప్పులతో ఇంటి వరకే ఉంటుండగా తర్వాత దవాఖానల చుట్టూ తిరుగుతున్నారు. కీలు మార్పిడి శస్త్ర చికిత్సలో భాగంగా మోకాలి చిప్ప వెనుక భాగంలో ఉన్న ఎముకలను సవరించి, కొంతమేర తొలగించి స్టీల్ రకం కృత్రిమ కీలు అమర్చుతారు. తొడ, ఎముక, కాలు ఎముక కలిపే చోట ఈ మార్పు చేస్తారు.

సాధారణంగా కార్పొరేట్ దవాఖానల్లో ఈ శస్త్రచికిత్సకు రూ. 2 లక్షల నుంచి 5 లక్షల వరకు ఖర్చవుతుంది. ఎక్కువగా ప్రైవేటు దవాఖానల్లోనే ఈ రకమైన ఆపరేషన్లు నిర్వహిస్తుంటారు. సమస్య జఠిలం కాకుంటే మోకాళ్ళకు పట్టీలు అమర్చుకునే సదుపాయం కల్పిస్తారు. ఆ తరహా వైద్యం పేదలకు భారంగా మారు తుంది. ఇలాంటి సమయంలో ఉచితంగా చికిత్సల వైపు అడుగేడయం శుభ పరిణామం.

30 ఏండ్ల నుంచే జాగ్రత్తలు తీసుకోవడం ఆరంభిస్తే కీళ్ళ నొప్పులకు దూరంగా ఉండొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. రోజువారీగా వ్యాయమం చేయాలని, జీవన శైలి మార్పుతో పాటు పౌష్టికాహారం ఎక్కువగా తీసుకోవాలని చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన మోకీలు ఉచిత ఆపరేషన్ల సేవలతో ఎంతోమంది సుదీర్ఘంగా ఎదుర్కొంటున్న సమస్యకు పరిష్కారం లభించనున్నది.

గతంలో ఉస్మానియా, గాంధీ, నిమ్స్ దవాఖాలకే పరిమితమైన మోకీలు మార్పిడి శస్త్ర చికిత్సలు ఇప్పుడు జిల్లా ప్రభుత్వ దవాఖాన లోనూ నిర్వహిస్తున్నారు.

మాతృ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానలో ముగ్గురు మహిళలకు మోకలు మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించారు.

మాక్లూర్ మండలం గొట్టుముక్కలకు చెందిన లలిత, దుర్గానగర్‌కు చెందిన నీలాబాయి, తడపాకల్‌కు గంగా మణికి ఈ ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించారు.

**ఆర్థో విభాగాన్ని సంప్రదించాలి**

**మో**కీలు ఆపరేషన్లతో నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ దవాఖాన మరోసారి ప్రత్యేకతను చాటుకున్నది. సిద్ధిపేట తర్వాత నిజామాబాద్‌లో విజయవంతంగా మోకీలు ఆపరేషన్లు జరగడం గర్వించదగినవి. నిపుణులైన ఆర్థో విభాగం వైద్యులతో మోకీలు మోకీలు ఆపరేషన్లు రెగ్యులర్‌గా చేసేందుకు నిర్ణయించాం. సమస్య తీవ్రంగా ఉన్నవారు జీజీహెచ్‌లో వైద్యులను సంప్రదించాలి. 166 మందిలో సీరియస్‌గా ఉన్నవాళ్ళను గుర్తించి ముగ్గురికి శస్త్ర చికిత్సలు పూర్తి చేశాం. మిగిలిన వాళ్ళకు వరుస క్రమంగా నిర్వహిస్తాం.

*– డా.ప్రతిమా రాజ్, జీజీహెచ్, సూపరింటెండెంట్*

**ఇదో చారిత్రాత్మకమైన సందర్భం**

**మ**దర్స్ డే సందర్భంగా ముగ్గురు 30, 60, 55 ఏండ్ల మహిళలకు మోకీలు ఆపరేషన్లు చేశాం. ఇప్పుడు వారు చాలా మంచిగా ఉన్నారు. ప్రభుత్వ దవాఖనల్లో ఇదో చారిత్రక సందర్భం. జనరల్ దవాఖానలో మోకాలు రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ థియేటర్‌తో పాటు 30 బెడ్లతో ప్రత్యేక వార్డును కేటాయించాం. వారానికి 10 నుంచి 15 శస్త్రకిచిత్సలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నాం. వారంలో సగం రోజులు ఆపరేషన్లకే కేటాయించాలని భావించాం. మంత్రి హరీశ్ రావు చొరవ అభినందనీయం.

*– డా. నాగేశ్వర్ రావు, జీజీహెచ్, ఆర్థోవిభాగం అధిపతి*

**దవాఖానలో మంచిగ చూసుకున్నరు.....**

**మో**కాళ్ళ సమస్యతో పడే అవస్థలు చెప్పరానిది. అనేక మంది డాక్టర్లకు చూయించుకున్నాను. మందులు వాడుతున్నా నొప్పి తగ్గుతలేదు. ఆపరేషన్ చేయించుకోవాలంటే మస్తుగా పైసల్ అవుతాయని చెప్పిన్రు. నిజామాబాద్ దవాఖానలో ఫ్రీగా మోకాళ్ళ ఆపరేషన్ చేసింద్రు. ఇంటోళ్ళ లెక్క దవాఖానలో మంచిగా చూసుకుంటున్నారు. చాలా సంతోషంగా ఉంది.

*– లలిత గొట్టుముక్కల, మాకూర్ మండలం* ■

# కూరగాయల విక్రేత కూతురు సివిల్ జడ్జి!



**ఈ** రోజుల్లో చాలామంది యువత చిన్న చిన్న అవాంతరాలకే కుంగిపోతున్నారు. అయినా కొంతమంది మాత్రం పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపిస్తూనే ఉన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన అంకిత నాగర్ అనే అమ్మాయి కూడా ఈ కోవకే చెందుతుంది. కూరగాయలు అమ్మితే కానీ పూట గడవని కుటుంబంలో జన్మించిన ఆమె... పట్టు వదలకుండా చదివి సివిల్ జడ్జిగా ఎంపికైంది. ఈ క్రమంలో అంకిత గురించి కొన్ని ఆసక్తికరమైన విశేషాలు మీకోసం...

**డాక్టర్ కావాలనుకుని...**

అంకిత (29)ది మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా ముసఖేది అనే ప్రాంతం. ఆమె తల్లిదండ్రులు అదే ప్రాంతంలో తోపుడు బండిలో కూరగాయలు అమ్ముతుంటారు. వారికి ముగ్గురు సంతానం. వారిలో అంకిత మధ్య అమ్మాయి. అంకిత చిన్నతనంలో డాక్టర్ కావాలనుకుందట. 'నేను స్కూల్‌లో చదువుతున్నప్పుడే డాక్టర్ కావాలను కున్నాను. కానీ, మా తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి అందుకు సరిపోదు. అందుకే ఆ ఆలోచనను విరమించుకున్నాను. కానీ, నాముందు మరిన్ని అవకాశాలు కన్పించాయి. వాటిని సాధించాలంటే కష్టపడి చదవడమే ముందున్న మార్గం అనుకున్నాను' అనిఅంటోందీ కొత్త జడ్జి. అలా ఆర్థిక పరిస్థితులు సహకరించకపోయినా స్కాలర్‌షిప్‌లతో ఎల్ఎల్ఎమ్, ఎల్ఎల్‌బి పూర్తి చేసింది.

**అప్లికేషన్‌కు కూడా డబ్బులు లేవు..**

అంకిత ఒక వైపు ఎల్ఎల్‌బి చదువుతూనే మరోవైపు జడ్జి పరీక్షకు ప్రిపేర్ అవ్వడం ప్రారంభించింది. దానికోసం రోజూ 8 నుంచి 10 గంటల వరకు చదివింది. ఈ క్రమంలో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంది. ఒకానొక సమయంలో పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి కూడా ఆమె దగ్గర సరిపడ డబ్బులు లేవు. కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా ఒకవైపు చదువుతూనే కొంత సమయం తల్లిదండ్రులకు సహాయంగా కూరగాయలూ అమ్మింది.

**పెళ్లి చేసుకోమని ఒత్తిళ్లు...**

కొన్ని కుటుంబాల్లో అమ్మాయిలు ఒక వయసుకు వచ్చాక వారిని పెళ్లి చేసుకోమంటూ పెద్దలు ఒత్తిడి చేస్తుంటారు. అవే ఒత్తిళ్లు తనకూ ఎదురయ్యాయంటోంది అంకిత. 'ఎల్ఎల్‌బి పూర్తైన దగ్గర్నుంచి పెళ్లి చేసుకోమని బంధువుల నుంచి ఒత్తిళ్లు వచ్చాయి. కానీ ఆ సమయంలో నా తల్లిదండ్రులు నాకు మద్దతుగా నిలిచారు' అనిచెప్పుకొచ్చింది.

**నాలుగో ప్రయత్నంలో..**

కరోనా సమయంలో విధించిన లాక్‌డౌన్ తనకు ఎంతో ఉపయోగపడిందని చెబుతోంది అంకిత. ఇంటి దగ్గరే ఉండడంతో ఎక్కువ సమయం చదువుకు కేటాయించింది. ఇందుకోసం యూట్యూబ్‌ని ఎక్కువగా ఉపయోగించుకుందట. 'లాక్‌డౌన్‌లో చదువుకోవడానికి ఎక్కువ సమయం

# అమెరికాలో గుర్తింపు పొందిన భారత మహిళా రైతు!

**విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా... తన వ్యవసాయ మూలాల మీద ప్రేమతో రైతుగా మారారు తెలుగు మహిళ కొణతం విశాలి. అమెరికాలోని వర్జీనియాలో 43 రకాల కూరగాయలు, ఆకుకూరలు పండిస్తున్నారు. ఆమె అక్కడి స్థానిక ప్రభుత్వం అధికారికంగా గుర్తించిన ఏకైక భారతీయ మహిళ రైతు కూడా. విశాలి 'నవ్య'తో పంచుకున్న సాగు సంగతులు...**

--------

"**నా**ది తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు. ఎస్ఎస్‌సి వరకు మోత్కూరులో, ఇంటర్మీడియట్ నల్లగొండలో, డిగ్రీ, పీజీ హైదరాబాదులో చదివాను. 2005లో ఎన్ఆర్ఐ మొగుళ్ల శ్రీధర్‌రెడ్డితో నా వివాహం జరిగింది. ఆయనతో కలిసి అమెరికా వెళ్లాను. అక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరాను. మాకు ఇద్దరు కుమార్తెలు.

**నాన్నే ప్రేరణ**

మా నాన్న పేరు కొణతం బక్కారెడ్డి. మాది రైతు కుటుంబం. వ్యవసాయం మీద పెద్దగా లాభం రాకపోయినా నాన్న పలు రకాల పంటలు సాగు చేసేవారు. జీవించినంత కాలం వ్యవసాయాన్ని వదలలేదు. మోత్కూరులో మా ఇంటి ముందు విశాలమైన ఖాళీ స్థలం ఉంది. అందులో నా అమ్మా, నాన్నా రకరకాల కూరగాయలు పండించేవారు. పూల మొక్కలు పెంచేవారు. నేను కూడా సెలవుల్లో తోట పనులు చేసేదాన్ని. మోత్కూరు మునిసిపాలిటీ పరిధిలోని బుజిలాపురానికి చెందిన మా అత్తగారిది కూడా రైతు కుటుంబమే. అందుకే...వర్జీనియాలోని లౌడెన్ కౌంటీలో..ఉద్యోగం చేస్తూనే ఖాళీ సమయాల్లో మేము ఉంటున్న ఇంటి పెరట్లో కూరగాయల సాగు ప్రారంభించాను. అలా ఏడేళ్ళు చేశాక... ఎక్కువ విస్తీర్ణంలో వ్యవసాయం చేయాలనిపించింది. ఆ ఆలోచనను నా భర్తకు చెబితే... ఇక్కడ వ్యవసాయం చేయడం

*(మిగతా 33 వ పేజీలో)*

---

దొరికింది. యూట్యూబ్ ద్వారానే ఎక్కువగా చదువుకున్నాను. ప్రభుత్వం ఇచ్చే స్కాలర్‌షిప్‌లు ఆర్థికంగా ఉపయోగపడ్డాయి' అనిచెప్పుకొచ్చింది.

ఎన్నో సవాళ్లను అధిగమించి కష్టపడి చదివిన అంకితకు మొదటి ప్రయత్నంలోనే ఓటమి ఎదురయ్యింది. కానీ, జడ్జి కావాలనే దృఢ సంకల్పంతో పట్టువదలనివిక్రమార్కునిలా ప్రయత్నించింది. అలా మొదటి మూడు ప్రయత్నాలు విఫలమైనా తన నాలుగో ప్రయత్నంలో విజయం సాధించింది. ఈ క్రమంలోనే ఇటీవలే విడుదలైన సివిల్ జడ్జి క్లాస్-2 ఫలితాల్లో ఎస్సీ విభాగంలో ఐదవ ర్యాంకును సొంతం చేసుకుని తన చిరకాల కోరికను నేరవేర్చుకుంది.

**ఇద్దరూ సమానమే!**

అంకిత సాధించిన విజయంతో ఆమె తల్లిదండ్రులు ఆనందంలో మునిగితేలుతున్నారు. 'కూరగాయలు అమ్మితే కానీ కుటుంబం గడవదు. అయినా కూతురి చదువు కోసం కొంత డబ్బు దాచేవాళ్లం. గత ఐదారు సంవత్సరాలు చాలా ఇబ్బందిగా గడిచాయి. మా అబ్బాయి, అమ్మాయిలకు సమాన ప్రాధాన్యం ఇచ్చి చదివించాం' అని చెబుతోంది అంకిత తల్లి లక్ష్మి.

ఇక అంకిత తండ్రి మాట్లాడుతూ 'మా ఆనందాన్ని మాటల్లో చెప్పలేం. ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నాం. అయినా కొంత మొత్తాన్ని దాచి అంకితను చదివించాం.

చాలామంది కొడుకు, కూతురి విషయంలో వ్యత్యాసం చూపిస్తుంటారు. కానీ, అలా చేయకూడదు. ఇద్దరూ సమానమే. ఈ రోజు ప్రతిఒక్కరూ మాకు అభినందనలు తెలియజేస్తున్నారు. నాకు ముగ్గురు పిల్లలు. ఒకరు ఎంబీయే పూర్తి చేశారు. చిన్నమ్మాయికి పెళ్లైంది. అమ్మాయిలు చదువుకోవాలి' అని చెప్పడం గమనార్హం.

(ఈనాడు సౌజన్యంతో) ■

**అనుకున్నది నెరవేరనప్పుడు మరింత తపన,మరింత కృషి, చెదరని చిరునవ్వు మరింతగా అవసరం**

# కిరాణాకొట్టు నుంచి కంపెనీ సీఈవోగా...

**సూ**ర్యుడు తూర్పున ఉదయిస్తాడు... మరి ఆ వెలుగులు అన్ని చోట్లా ప్రసరిస్తాయా అంటే అనుమానమే... కానీ దుంగర్‌పూర్ ప్రాంతాన్ని రుక్మిణీదేవి సౌర వెలుగులతో నింపేస్తోంది. ఎనిమిదో తరగతి మాత్రమే చదువుకున్న ఆమె తనతో పాటు వందలాది మహిళల జీవితాల్లో వెలుగులు పూయిస్తోంది... ఆ కాంతుల్ని చూద్దాం పదండి...

రుక్మిణి జీవితం మొదలయ్యింది ఇబ్బందులతోనే. ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడే అంటే 13వ ఏట పెళ్లై, అత్త వారింట్లో అడుగుపెట్టింది. భర్త నడిపే చిన్న కిరాణా దుకాణంలో సాయంగా కూర్చునేది. రోజంతా అలా




కూర్చోవడం నచ్చేది కాదు. ఏదైనా చేయాలనుకునేది.

వీళ్లది రాజస్థాన్‌లోని దుంగర్‌పూర్ ప్రాంతం. అదే సమయంలో ఐఐటీ ముంబయి పరిశోధక బృందం ఆధ్వర్యంలో గ్రామాల్లో సౌర విద్యుత్తు విప్లవం ప్రారంభమైంది. రుక్మిణి ఉత్సాహాన్ని గుర్తించిన ఐఐటీ ముంబయి ప్రొఫెసర్ సోలంకి తన బృందం రూపొందించిన సౌర దీపాలను ప్రతి ఇంటికీ చేర్చాల్సిన బాధ్యతను ఆమెకు అప్పగించారు. ఇంటింటికీ తిరిగి సౌరదీపాలను అందించేది రుక్మిణీదేవి. వాళ్ల ఊళ్లో అయ్యాక చుట్టుపక్కల గ్రామాల బాధ్యతా రుక్మిణిదే. కానీ ఇంట్లో ఇదొక సమస్యగా మారింది.

గడప దాటి బయటకు వెళ్లని ఆ ఇంటి సంప్రదాయం నుంచి ఈమె ఊరూరా తిరగాల్సి రావడంతో భర్త అభ్యంతరం చెప్పాడు. అయితే తన పట్టుదలను, తన పని వల్ల కలుగుతున్న ఫలితాలను భర్త గుర్తించాడు. క్రమేపీ అయిష్టతను పక్కన పెట్టాడు. తన పనుల్లో భాగంగా సౌర శక్తితో పనిచేసే చిన్నచిన్న ప్యానెల్స్ తయారీని ఐఐటీ ముంబయి బృందం వద్ద చూసేది. వాటి వినియోగాన్ని గుర్తించి, ఆసక్తి పెంచుకొంది. వాటి తయారీలో తానూ శిక్షణ తీసుకుంది.

స్థానికంగా మహిళా సాధికారతను పెంచే దిశగా దుంగర్‌పూర్‌లో ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్ట్‌లో భాగస్వామురాలైంది. 2017లో ప్రభుత్వ చేయూతతో 'దుర్గా ఎనర్జీ' (దుంగర్‌పూర్ రెన్యువబుల్ ఎనర్జీ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్) తయారీ యూనిట్‌ను ప్రారంభించింది. మూడు పదులు కూడా నిండని వయసులో రుక్మిణి ధైర్యంగా వేసిన ముందడుగు తన జీవితాన్నే కాదు... ఆ ఊరి చరిత్రనే మార్చేసింది. గ్రామ మహిళలకు మార్గదర్శకమైంది.

**అందరూ మహిళలే...**

దుర్గా యూనిట్‌లో బాధ్యతలన్నీ మహిళలకే అప్పగించాలనుకుంది రుక్మిణి. శక్తిసామర్థ్యాలు, ఆసక్తిని బట్టి వారికి శిక్షణనిప్పించేది. సంస్థలో ఉన్నత స్థానాల్లో అవకాశమిచ్చింది. సీఈవోగా రుక్మిణీనే వ్యవహరిస్తోంది. ఈ యూనిట్‌కు రాజస్థాన్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఫండ్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్సార్) నిధులు అందించగా, ఐఐటీ ముంబయి సాంకేతిక భాగస్వామి.

గ్రామంలోని స్వయం సహాయక బృందాల సభ్యులు మాన్యువల్ షీట్ కటింగ్ నుంచి టెస్టింగ్, సోలార్ లామినేషన్ వరకు శిక్షణ తీసుకొని ఉపాధి పొందుతున్నారు. ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నారు. వీరు రూపొందించిన సౌరదీపాలు పిల్లల చదువులకు, మహిళల ఇంటి పనులకు ఉపయోగపడుతున్నాయి. ఈ అయిదేళ్లలో చుట్టుపక్కల



గ్రామాలు, సమీప పట్టణాల్లో దుర్గా ఎనర్జీ దాదాపు 40వేల సౌరదీపాలు విక్రయించింది.

**అవసరాలన్నింటికీ..**

ఎల్ఈడీ దీపాలనుంచి ఛార్జ్ కంట్రోలర్, బ్యాటరీ,సోలార్ ప్యానెల్, మొబైల్ ఛార్జింగ్ పోర్ట్ వరకూ ఎన్నో తయారు చేస్తున్నారు వీళ్లు. 'ఇంట్లో ప్రతి అవసరానికి ఈ ఉత్పత్తులు ఉపయోగపడతాయి. సోలార్ టేబుల్ ఫ్యాన్‌కు కావాల్సిన బ్యాటరీ, సోలార్ ప్యానెల్‌వంటివన్నీ మా వద్ద లభ్యమవుతాయి.

సౌరశక్తితో పనిచేసే స్టడీల్యాంప్, వాటర్‌హీటర్, వీధి దీపాలు తయారుచేస్తున్నాం. దిల్లీ సహా ప్రధాన నగరాల్లో వీటిని ప్రదర్శించి అవగాహన కలిగిస్తున్నాం. 2018లో ప్రధాని నరేంద్ర మోదీ దిల్లీ ప్రదర్శనలో మమ్మల్ని కొనియాడారు. అప్పుడే ప్రధాని మోదీ నుంచి దుర్గా ఎనర్జీ ఉత్తమ స్టార్టప్ అవార్డు అందుకుంది. ఆడవాళ్లంటే ఇంటి పనులకే అన్న పరిస్థితులను అధిగమించి ఇప్పుడు మేమూ మరికొందరికి స్ఫూర్తిగా నిలుస్తున్నాం. దుర్గా ఎనర్జీలో 300 మందికి పైగా పని చేస్తున్నారు. త్వరలో మరిన్ని తయారీ యూనిట్స్‌ను ప్రారంభించి వేల సంఖ్యలో మహిళలకు ఉపాధి అందించాలన్నది నా కల'. ■

# ప్రతికూలతలను తట్టుకునే 'కుద్రత్-3 రకం కంది

ప్రసిద్ధ రైతు శాస్త్రవేత్త ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రకాశ్ సింగ్ రఘువంశీ రూపకల్పన చేసిన కుద్రత్-3 రకం కంది ప్రతికూల వాతవరణ పరిస్థితులను ధీటుగా తట్టుకొని అధిక దిగుబడులనిస్తూ అనేక రాష్ట్రాల రైతులను ఆకర్షిస్తోందని బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో పప్పుధాన్యాల విభాగం పూర్వ ప్రధాన శాస్త్రవేత్త డా. యు.పి. సింగ్ తెలిపారు. హెక్టారుకు 36 క్వింటాళ్ల కందుల దిగుబడినిచ్చే ఈ రకం యూపీతో పాటు బీహార్, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రైతుల ఆదరణ పొందిందన్నారు. భూతాపం వల్ల మారిన వాతావరణ పరిస్థితుల్లో ఈ రకం రైతులకు స్థిరమైన భరోసానిస్తుందని కుద్రత్-3 ఆవిష్కర్త రఘువంశీ అంటున్నారు. దీని పంటకాలం 235 రోజులు. వంద గింజల బరువు 17.57 గ్రాముల బరువు తూగుతాయి. వివరాలకు....

ప్రకాశ్‌సింగ్ రఘువంశీ - 98392 53974, 70203 07801. **(సాక్షి)** ■

# ఆ మహిళా రైతుల ఆదాయం ఏడాదికి రూ.30 లక్షలు

**ఆ** ప్రాంతంలోని మహిళలు సాగులో సత్తా చాటుతున్నారు. లక్షల్లో ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. వారి సక్సెస్ సీక్రెట్‌కు సంబంధించిన వివరాలను మనమూ తెలుసుకుందాం.

దేశంలో మహిళా సాధికారత పెరుగుతోంది. వ్యాపారంతో పాటు సొంతంగా వ్యవసాయం చేయడానికి కూడా అనేకమంది మహిళలు ముందుకు వస్తున్నారు. ఆయా రంగాల్లో పురుషులకు ధీటుగా రాణిస్తూ సత్తా చాటుతున్నారు ఆ మహిళలు.



ముఖ్యంగా రాజస్థాన్‌లోని గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు తమ తెలివితో వ్యవసాయాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్నారు. సరికొత్త రికార్డులను నెలకొల్పుతున్నారు. ఈ రాష్ట్రంలోని మహిళలు ప్రస్తుతం ప్రభుత్వ గుర్తింపు పొందిన 20 స్టార్టప్‌లను విజయవంతంగా నడుపుతుండడం విశేషం. ఇందులో ఐదు సేంద్రియ వ్యవసాయం, రెండు డెయిరీ, 13 ఇతర వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఉన్నాయి.

ఇలా విజయవంతమైన మహిళల్లో సికర్ జిల్లాలోని జిగర్ బడ్డీ గ్రామానికి చెందిన సంతోష్ పచార్ కూడా ఉన్నారు. సంతోష్ పచార్ కేవలం 8వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. అయితే క్యారెట్ విత్తనాలను తయారుచేసే కొత్త విధానాన్ని అభివృద్ధి చేసినందుకు రెండుసార్లు (2013 మరియు 2017లో) రాష్ట్రపతి అవార్డును ఆమె గెలుచుకున్నారు. తన ధైర్యం, కృషి, నైపుణ్యంతో సమాజానికి ఆదర్శంగా నిలిచారు పచార్.

**క్యారెట్ సీడ్ యొక్క కొత్త టెక్నిక్**

సంతోష్ పచార్‌కు దాదాపు 30 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఇందులో ఆమె 2002లో అధునాతన సేంద్రియ వ్యవసాయాన్ని ప్రారంభించారు. వ్యవసాయం ప్రారంభించిన సమయంలో తొలిసారిగా పొడవాటి, సన్నగా మరియు వంకరగా ఉండే క్యారెట్‌లను చూశానని పచార్ చెప్పారు. దాంతో మార్కెట్ నుంచి కొనుగోలు చేసిన విత్తనాలు సరిగా ఉండడం లేదని ఆమె గుర్తించారు.

ఈ సమస్యను పరిష్కరించడానికి సొంత ప్రణాళికను రూపొందించారు. పచార్ 1 కిలో క్యారెట్ గింజలను 15 మి.లీ తేనె మరియు 5 మి.లీ నెయ్యితో కలిపి నీడలో ఆరబెట్టడం ద్వారా కొత్త విధానాన్ని అభివృద్ధి చేశారు. ఈ టెక్నిక్ వల్ల విత్తనాలు వేగంగా మొలకెత్తడంతో పాటు క్యారెట్ పొడవు కూడా విపరీతంగా పెరిగింది. దీంతో పచార్ క్యారెట్ తీపిని 5% పెంచడమే కాకుండా ఒకటిన్నర నుంచి రెండు రెట్లు ఉత్పత్తిని రెట్టింపు చేసింది.

ఆమె గొప్పతానాన్ని, కృషిని ప్రభుత్వం గుర్తించింది. దీంతో మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ నుంచి ఆమె రూ.3 లక్షల బహుమతితో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. పచార్ స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆవు పేడ గ్యాస్ ప్లాంట్‌ను కూడా పచార్ నెలకొల్పారు. ఇది

# మహిళల పట్ల అన్యాయాన్ని కమిషన్ దృష్టికి తీసుకురండి

**ఫే**స్ బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌లో @SCWTelangana ద్వారా, ఇమెయిల్ telanganastatewomenscommission@gmail.com, హెల్ప్ లైన్ 181 లేదా కమిషన్ వాట్సప్ నంబర్ 9490555533 ద్వారా కూడా మహిళలకు జరిగే అన్యాయాన్ని కమిషన్ దృష్టికి తీసుకురావచ్చని తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాకిటి సునీతా లక్ష్మారెడ్డి తెలిపారు. మహిళా చట్టాలు కేవలం మహిళలే కాదు పురుషులు కూడా తెలుసుకోవాలని, తద్వారా మహిళలకు కల్పించిన హక్కుల పట్ల అవగాహన కలుగుతుందని సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. ఆడపిల్లలపై సమాజ ఆలోచన విధానంలో కూడా మార్పు రావాలని అన్నారు.

యాదాద్రి జిల్లా పర్యటనలో భాగంగా ప్రభుత్వ బాలికల వసతి గృహమును ఆకస్మిక తనిఖీ చేసి బాలికల వసతి సౌకర్యాలను గురించి తెలుసుకున్నారు. అనంతరం జిల్లాలోని సఖి కేంద్రాన్ని సందర్శించారు.

అనంతరం మహిళా సమస్యలపై జిల్లాలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా, కలెక్టరు పమేలా సత్పతి, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దీపక్ తివారి, మహిళా కమిషన్ సభ్యులు షహీన్ అఫ్రోజ్, కుమ్మ ఈశ్వరీబాయి, కొమ్ము ఉమాదేవి, గద్దల పద్మ, సుద్ధం లక్ష్మి, కటారి రేవతి, కమిషన్ సెక్రటరీ కృష్ణ కుమారి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఛైర్ పర్సన్ మాట్లాడుతూ ఆడ, మగ బేధాభిప్రాయం చూపిస్తూ పిల్లను పెంచకుడదని, సమాన హక్కులు కల్పిస్తూ పెంచాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

ముఖ్యంగా బాల్య వివాహాలు అరికట్టడం, గృహ హింస, భార్యాభర్తల వివాదాలు, యుక్త వయసులో ఎదురయ్యే ప్రేమ తదితర వంటి సమస్యలపై సఖి, ఎంఎస్కే ద్వారా పాఠశాలల్లో మరియు కళాశాలల్లో పిల్లలకు అవగహన కల్పించాలన్నారు. మహిళలు, ఆడపిల్లలు అనీమియా బారిన పడకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు.

ఎవరైనా న్యాయం కోసం ఆర్థికంగా అడ్వకేట్‌ను నియమించుకోలేని వారికి డీ.ఎల్.ఎస్.ఏ ద్వారా ఉచితంగా న్యాయ సహాయాన్ని, అడ్వకేట్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ■

---

ఆమెతో పాటు అదే గ్రామంలోని 20 కుటుంబాలకు ప్రయోజనం చేకూర్చింది. వ్యవసాయంలో కొత్త పద్ధతులను తెలియజేస్తూ ఇతర మహిళలకు కూడా సహాయం చేస్తున్నారు సంతోష్ పచార్.

**హార్టికల్చర్‌లో కూడా నైపుణ్యం**

సికార్ జిల్లాకు చెందిన సంతోష్ ఖేదర్ అనే మరో మహిళా రైతు దానిమ్మ సాగులో ప్రత్యేకత సాధించారు. ఆమె భర్త హోంగార్డు. అతనికి దానిమ్మ తోట నాటాలనే ఆలోచన వచ్చింది. దీంతో వారు ఆ సాగును వెంటనే ప్రారంభించారు.

దానిమ్మ మొక్కలు నాటిన తర్వాత మొదటి పంట రావడానికి మూడేళ్లు పట్టింది. పంటతో ఎంత డబ్బు సంపాధన ఉంటుందో కూడా ఆమెకు తెలియదు. అయితే చివరికి వారి కష్టానికి తగిన ఫలితం దక్కడంతో వారి ఆదాయం రెట్టింపు అయింది.

ఖేదార్ దానిమ్మ చెట్ల మధ్య ఖాళీ స్థలంలో నిమ్మ, జామ మొక్కలను కూడా నాటారు. ఈ ప్రయోగం కూడా విజయవంతమై ఏడాదికి రూ.10 లక్షల ఆదాయం దాటింది. దీంతో నేడు వారు నర్సరీని కూడా నడుపుతున్నారు.

దానిమ్మ, నిమ్మ, కిన్ను, నారింజ మరియు మామిడి మొక్కలను ఇతర రైతులకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం హార్టికల్చర్ ద్వారా వారి కుటుంబానికి ఏటా రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల ఆదాయం వస్తుండడం విశేషం.

('న్యూస్ 18-తెలుగు' సౌజన్యంతో...) ■

# మొక్కే విత్తనమై స్వయంసహాయ వటవృక్షమై !

***కనుచూపు మేరలో చెట్టన్నది లేదు... అంతా రాళ్లగుట్టలే! ఇది మూడు దశాబ్దాల కిందటి మాట. వంటచెరకు దొరక్క అవస్థలుపడిన ఆమె... చివరకు ఓ హరిత విప్లవానికి నాంది పలికారు. నేడు పాతిక లక్షలకు పైగా మొక్కలు నాటించి... అట్టడుగువర్గాల మహిళలకు ఉపాధి కల్పించి... 'నారీశక్తి' ఏమిటో నిరూపించారు ... ఆమే ...చామి ముర్మూ!***

-------

'మొక్కలు నాటడం సులువే. కానీ వాటిని రక్షించడం ఎంతో కష్టం. అందుకు శ్రమ ఒక్కటే సరిపోదు... చెట్లను నరికేసి, గుట్టు చప్పుడు కాకుండా అమ్మేసే మాఫియాను ఎదిరించి నిలబడే ధైర్యం కూడా కావాలి. నాది పర్యా వరణంతో ముడిపడిన ముప్పై రెండేళ్ల ప్రయాణం.




జార్ఖండ్ సెరైకేలఖార్సవాన్ జిల్లాలోని రాజ్‌నగర్ మాది. మా ఇళ్లల్లో పొయ్యి వెలగాలంటే కట్టెలు కావాలి. వాటిని ఎక్కడెక్కడికో వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చేది. ఒకసారి వంట చెరకు నిల్వ చివరకు చేరింది. ఒకటి రెండు రోజులకు మించి సరిపోదు. బయటకు వెళితే... చుట్టూ ఎటు చూసినా కొండ రాళ్లు... గుట్టలు. చెట్టన్నది కనిపించ లేదు. మరి వంట ఎలా? దిక్కు తోచలేదు. అప్పుడు అను కున్నా... సాధ్యమైనన్ని మొక్కలు నాటాలని! చుట్టుపక్కలవారితో కూడా నాటించాలని!

**ఒక యజ్ఞంలా...**

ఆ పని మా ఇంటి నుంచే మొదలుపెట్టాను. చుట్టూ మొక్కలు నాటాను. ఊళ్లో మహిళలందరినీ కలిసి... వాళ్లకు అవగాహన కల్పించాను. ఎంతోమంది ముందుకు వచ్చారు. ఒకటి రెండేళ్లలోనే మాకు వంట చెరకు సమస్య తీరి పోయింది. ప్రస్తుతం మా ఊరే కాదు... చుట్టుపక్కల పల్లెలు కూడా పచ్చదనంతో పరిమళిస్తున్నాయి. మొత్తం కలిపి ఇప్పటివరకు 28 లక్షలకు పైగా మొక్కలు నాటామంటే... నమ్మలేక పోతున్నాను. ఊరి ప్రజల భాగస్వామ్యం వల్లే ఇది సాధ్యమైంది. ఒక యజ్ఞంలా ఈ కార్యక్రమం సాగిపోతోంది.

మా లక్ష్యంలో చాలా దూరం ప్రయాణించాం. వంట చెరకు ఒక్కటే కాదు... కలప కూడా అమ్ముతున్నాం. వీటిల్లో కొన్ని పండ్ల చెట్లు ఉన్నాయి. వాటిని తీసుకువెళ్లి మార్కెట్‌లో విక్రయిస్తున్నాం. ఇదంతా మాకు అదనపు ఆదాయం. చెట్లు మా జీవన గతిని మార్చేశాయి.

*ఉద్యమంలా మేం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమం ఉపాధి మార్గాలనే కాకుండా... పర్యావరణ పరంగానూ ఎంతో మేలు చేసింది. మా ప్రాంతంలో కార్బన్ ఉద్గారాల శాతం తగ్గింది. సగటు ఉష్ణోగ్రతలు కూడా తగ్గి, వాతావరణం చల్లబడిందని స్థానిక అధికారులు చెబుతున్నప్పుడు నాకు ఎంతో ఆనందం కలుగుతుంది.*

**మహిళలకు ఆదాయం...**

అయితే ఆరంభంలో ఎన్నో సమస్యలు, సవాళ్లు ఎదుర్కొన్నాం. మేం నాటిన మొక్కలు కాస్త పెద్దవయ్యాక కొందరు నరికేసి తీసుకు వెళ్లేవాళ్లు. దాంతో మేము ఎంతో నష్టపోయేవాళ్లం. అటవీ శాఖ అధికారులను సంప్రతించాం. వారి సాయంతో అలాంటి వాళ్లను పట్టుకుని, జైలుకు పంపించాం. చెట్లను కాపాడుకొంటూ వచ్చాం.

నన్ను నమ్మి ఈ మహాయజ్ఞంలో భాగస్వాములైన మహిళలకు ఉపాధి మార్గం ఏదైనా చూపిస్తే బాగుంటుందను

కుటుంబ సభ్యులపట్ల ఓర్పు ప్రేమకు చిహ్నం, ఇతరుల పట్ల ఓర్పు గౌరవానికి సంకేతం

కున్నాను. దాని కోసం 'సహయోగి మహిళ' పేరుతో స్వచ్ఛంద సంస్థ ఒకటి నెలకొల్పాను. ఆ సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయ సంఘాలు ఏర్పాటు చేశాను. క్రమంగా ఒక్కొక్కటీ పెంచుకొంటూ... జిల్లా అంతటా విస్తరించుకొంటూ వెళ్లాం.

ప్రస్తుతం 2,800 స్వయం సహాయక సంఘాలు వేలమంది గ్రామీణ మహిళలకు ఉపాధి మార్గాలు చూపుతున్నాయి. తమకున్న భూమిలో మొక్కలు నాటి, వాటి ద్వారా వారు నెలకు పన్నెండు వేల రూపాయల వరకు ఆర్జిస్తున్నారు.

అంతేకాదు... ఈ సంఘాల్లో ఎవరికి ఏ అవసరం వచ్చినా ఆదుకొనేలా ఒక నిధి ఏర్పాటు చేశాం. దాని కోసం ప్రతి సభ్యురాలి నుంచి నెలకు పది నుంచి ఇరవై రూపాయలు సేకరిస్తాం. సొంత వ్యాపారం ప్రారంభించుకోవడానికి ఆ మొత్తం నుంచి ఆర్థిక సాయం అందిస్తాం. ఆసక్తి ఉన్నవారికి కోళ్ల పరిశ్రమ, గొర్రెల పెంపకం వంటి వాటిల్లో శిక్షణ కూడా ఇస్తున్నాం.

**వేడి తగ్గింది...**

ఉద్యమంలా మేం చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమం ఉపాధి మార్గాలనే కాకుండా... పర్యావరణ పరంగానూ ఎంతో మేలు చేసింది. మా ప్రాంతంలో కార్బన్ ఉద్గారాల శాతం తగ్గింది. సగటు ఉష్ణోగ్రతలు కూడా తగ్గి, వాతావరణం చల్లబడిందని స్థానిక అధికారులు చెబుతున్నప్పుడు నాకు ఎంతో ఆనందం కలుగుతుంది. మా ప్రాంతాన్ని సందర్శిస్తే ఆ తేడా స్పష్టంగా కనిపిస్తుంది.

నా ఇన్నేళ్ల శ్రమకు గుర్తింపుగా రెండేళ్ల కిందట 'నారీ శక్తి సమ్మాన్'ను రాష్ట్రపతి నుంచి అందుకున్నాను. ఆ క్షణం నేను ఎప్పటికీ మరిచిపోలేను.

మొక్కలు నాటడంతో మొదలైన నా ప్రయాణం... నేడు ఎంతోమందికి స్ఫూర్తిని ఇస్తున్నదంటే... అంతకుమించిన సంతృప్తి ఏముంటుంది!" ■

## మహిళా ఉద్యోగుల పనివేళలపై యు పి ప్రభుత్వం ఆదేశం

**ఫ్యా**క్టరీల్లో ఉపాధి పొందే మహిళల పని వేళలపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. ఫ్యాక్టరీల్లో మహిళల చేత ఉదయం 6 గంటలకు ముందు, రాత్రి 7 గంటల తర్వాత పని చేయించరాదని ఆదేశించింది. ఒకవేళ పని చేయిస్తే ఆ మహిళలకు ఉచిత రవాణా, భోజన సదుపాయాలను కల్పించాలని తెలిపింది.

ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మే 27న జారీ చేసిన నోటిఫికేషన్‌లో, మహిళ లిఖితపూర్వక సమ్మతి తెలియజేసినపుడు మినహా, ఏ మహిళ చేత అయినా ఉదయం 6 గంటలకు ముందు, రాత్రి 7 గంటల తర్వాత పని చేయించరాదని తెలిపింది. ఒకవేళ రాత్రి 7 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్యలో పని చేయించినట్లయితే, ఆ మహిళలకు ఉచిత రవాణా, భోజన సదుపాయాలను కల్పించాలని తెలిపింది. రాత్రి ఏడు గంటల తర్వాత కానీ, ఉదయం 6 గంటలకు ముందు కానీ పని చేయడానికి తిరస్కరించిన మహిళను ఉద్యోగం నుంచి తొలగించరాదని చెప్పింది. రాత్రి 7 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్యలో పని చేసే మహిళలకు వారి ఇళ్ళ నుంచి ఫ్యాక్టరీకి, ఫ్యాక్టరీ నుంచి వారి ఇళ్ళకు ఉచిత రవాణా సదుపాయాన్ని ఆ ఫ్యాక్టరీ యాజమాన్యమే కల్పించాలని తెలిపింది. అదేవిధంగా వారికి ఆహారాన్ని కూడా యాజమాన్యమే అందజేయాలని పేర్కొంది. వారికి రక్షణ కల్పించే విధంగా పర్యవేక్షణను ఏర్పాటు చేయాలని పేర్కొంది.

మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు, బట్టలు మార్చుకునేందుకు గదులను కూడా అందుబాటులో ఉంచాలని తెలిపింది. రాత్రి 7 గంటల నుంచి ఉదయం 6 గంటల మధ్యలో మహిళలు పని చేయవలసి వస్తే, కనీసం నలుగురు మహిళలు కలిసి ఉండేలా చూడాలని తెలిపింది. లైంగిక వేధింపులను నిరోధించేందుకు తగిన చర్యలను కూడా తీసుకోవాలని తెలిపింది. ■

# రోజుకు 4 గంటల పని ... నెలకు 50వేల ఆదాయం !

**మీ**రు ఒకవేళ బిజినెస్ చేయాలని భావిస్తుంటే.. అందుకు కోళ్ల పెంపకం మంచి ఆప్షన్. మరి బ్రాయిలర్ కోళ్ల ఫామ్‌కు ఎంత పెట్టుబడి అవసరం? ఎంత ఆదాయం వస్తుంది? ఆ వివరాలను ఇక్కడ తెలుసుకుందాం.

ఈ కాలంలో చాలామంది ఉద్యోగాల కంటే సొంత వ్యాపారం పైపు మొగ్గు చూపుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు వస్తాయన్న గ్యారంటీ లేదు. ప్రైవేట్స్ జాబ్స్‌లో ఒత్తిడి ఎక్కువ. అంతేకాదు ఊరికి దూరంగా ఉండాల్సి ఉంటుంది. అందుకే చాలా మంది యువత బిజినెస్‌పై దృష్టి సారిస్తున్నారు. డబ్బు లేకున్నా.. లోన్ తీసుకొని అయినా.. వ్యాపారం చేసేందుకు ఇష్టపడుతున్నారు.

మీరు కూడా సొంతంగా వ్యాపారం చేయాలని భావి స్తుంటే.. అందుకు పౌల్ట్రీ ఫామ్ బిజినెస్ చక్కటి అవకాశం. దీనికి రోజుకు 4 గంటలు కేటాయిస్తే చాలు. ఆ తర్వాత ఇతర పనులు కూడా చేసుకోవచ్చు. పెట్టుబడి కాస్త ఎక్కువగా ఉన్నా ఇబ్బందేం లేదు. బ్యాంకులు రుణాలు ఇస్తాయి.

సాధారణంగా 10 వేల కెపాసిటీ ఉన్న కోళ్ల షెడ్డు నిర్మాణానికి దాదాపు రూ.10 లక్షల వరకు ఖర్చవుతుంది. షెడ్డు గోడలు, ఐరన్ మెష్, ఇతర సామాగ్రి మొత్తం ఇందులోనే వస్తాయి. ఏదో ఊరికి దూరంగా పొలాల్లో నిర్మించుకుంటే ఉపయోగం ఉండదు. రోడ్డు సౌకర్యం ఉ న్నచోటే పౌల్ట్రీ షెడ్‌ను నిర్మించాల్సి ఉంటుంది.

షెడ్డు నిర్మాణం పూర్తైన తర్వాత మీరు ఏదేని కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోవచ్చు. వెన్‌కాబ్, సుగుణ, స్నేహ వంటి పౌల్ట్రీ కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకోవచ్చు. సదరు కంపెనీ వారే మీకు బ్రాయిలర్ కోడి పిల్లలు ఇస్తారు. రవాణా ఖర్చులు కూడా వారివే. ఆ తర్వాత వాటికి అవసరమైన దాణా, రోగాల బారినపడకుండా ఇంజెక్షన్స్ కూడా వారే సప్లై చేస్తారు. మీరు కేవలం వాటిని పెంచి.. ఇవ్వాల్సి ఉంటుంది. అలా పెంచినందుకు.. కమిషన్ ఇస్తారు. కోళ్లు ఒక సైజుకు వచ్చిన తర్వాత.. కంపెనీ వారే వాహనాన్ని మీ షెడ్డు వద్దకు పంపించి.. కోళ్లను తీసుకెళ్తారు.

**ఆదాయం వివరాలు:**

మీరు ఒకవేళ 10 వేల సామర్థ్యంతో పౌల్ట్రీ ఫామ్ పెట్టారని అనుకుందాం. దాదాపు 45 రోజులకు బ్యాచ్ పూర్తవుతుంది. కోళ్లు ఒకటిన్నర నుంచి రెండు కేజీల బరువు పెరుగుతాయి. ఎలాంటి మోర్టాలిటీ లేకుండా అన్నీ బతికి.. ఒక్కొక్కటి 2 కేజీల చొప్పున పెరిగాయని భావిస్తే.. అప్పుడు మీ షెడ్‌లో ఉన్న మొత్తం కోళ్ల బరువు 20 వేల కేజీలు.

కంపెనీ వారు ఒక్కో కేజీకి రూ. 3 చొప్పున కమిషన్ చెల్లిస్తే.. మీకు రూ.60 వేలు వస్తాయి. ఖర్చులకు రూ.10 వేలు పోయినా.. రూ.50 వేలు మిగులుతాయి. కొన్ని కంపెనీలు రూ.4 కూడా ఇస్తాయి. అప్పుడు బ్యాచ్‌కు రూ.80 వేల వరకు వస్తాయి. ఈ లెక్కన నెలకు రూ.50వేలు మిగులుతాయి.

మీరు సమయం కేటాయించి.. జాగ్రత్తలు తీసుకుంటూ.. కోడి పిల్లల పెంపకంపై దృష్టి సారిస్తే... తక్కువ సమయంలో బాగా బరువు పెరుగుతాయి. అప్పుడు మరింత ఎక్కువ డబ్బులు వచ్చే అవకాశముంది.

మీరు పౌల్ట్రీ కంపెనీలతో కాంట్రాక్ట్ ఒప్పందం కాకుండా... సొంతంగా కూడా బిజినెస్ చేయవచ్చు. అంటే సొంతంగా కోడిపిల్లలు కొని.. వాటిన పెంచి.... మీరే అమ్ముకోవాల్సి ఉంటుంది. ఐతే దీనికి రిస్క్ ఎక్కువగా ఉంటుంది. ఏదైనా కారణంతో కోడిపిల్లలు మరణిస్తే.. భారీగా నష్టం వస్తుంది.

ఒకవేళ మార్కెటింగ్ చేసుకోలేక పోయినా ఇబ్బందులు తప్పవు. అన్ని అనుకున్నట్లుగా జరిగితే.. ఇందులోనే ఎక్కువ లాభాలు వస్తాయి. ఒక్క బ్యాచ్‌లోనే లక్షల్లో సంపాదించవచ్చు. కానీ రిస్క్ తీసుకోవడం ఇష్టం లేదనుకుంటే.. కంపెనీలతో కలిసి పని చేయడం ఉత్తమం. అన్నీ వారే ఇస్తారు. మీరు జస్ట్.. కోళ్లను పెంచి.. ఇస్తే చాలు. ■

**జీవితంలో ప్రతి పరీక్ష మన సామర్థ్యాన్ని మరింత పెంచుతుంది, లేదా చేతగానితనాన్ని చాటుతుంది**

# అమెరికాలో గుర్తింపు పొందిన భారత మహిళా రైతు!

**(25 వ పేజీ తరువాయి)**

అంత సులువు కాదన్నారు. చివరకు ఒప్పుకున్నారు. ఆ తరువాత ఆయన, మా అక్క కూతురు అర్చన గట్టి మద్దతుగా నిలిచారు. అక్కడ ఎకరం భూమిని లీజుకు తీసుకున్నాను. అందులో మన ప్రాంతంలో లభించే టమాట, కాకర, దోసకాయ, బీన్స్, పొట్ల, సొర, బెండ లాంటి కూరగాయలు, పలు రకాల ఆకుకూరలు, పచ్చిమిర్చి, ఉల్లిగడ్డ, వెల్లుల్లి లాంటి 43 రకాల భారతీయ పంటలను సేంద్రియంగా సాగు చేస్తున్నాను. మా పంటలను రెస్టారెంట్లకు, స్టోర్స్‌లకూ అమ్మకుండా వినియోగదారులకే నేరుగా విక్రయించాలని నిర్ణయించుకున్నాం. ఇక్కడ తాజా కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా దొరకవు. ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొని, రిఫ్రిజిరేటర్లలో నిల్వ చేసినవే ఎక్కువ.



తమ కళ్లముందే పండించిన తాజా కూరగాయలు ఇస్తుండడంతో మా ఉత్పత్తులకు జనం నుంచి డిమాండ్ బాగానే ఉంది. వినియోగదారులే వచ్చి స్వయంగా కోసుకొని... తీసుకెళ్లారు.

సుమారు ఎనభై కుటుంబాలు మా దగ్గర రెగ్యులర్‌గా కొంటాయి. ఆర్డర్ చేస్తే... సమీపంలో ఉన్నవారికి హోం డెలివరీ కూడా చేస్తున్నాం. వచ్చే ఏడాది వ్యవసాయాన్ని అయిదు ఎకరాలకు పెంచాలని, అక్కడ ఒక స్టోర్ కూడా ఏర్పాటు చేయాలని అనుకుంటున్నాం.

**ఉత్తమ రైతుగా...**

ఒకరోజు... మా అమ్మాయి సాహితి చదువుతున్న స్కూల్ ఆడిటోరియంలో కార్యక్రమం ఒకటి నిర్వహించారు. అందులో అందరికీ బుక్‌లెట్స్ పంచారు. అలాగే 20 నిమిషాల నిడివి ఉన్న వీడియో ప్రదర్శించారు. వీడియో చూసిన వెంటనే విద్యార్థులు ఐదో తరగతి చదువుతున్న మా అమ్మాయిని "విశాలి మీ అమ్మే కదా!" అని అడగడం మొదలెట్టారు. సాహితి "అవును... మా అమ్మే, తను రైతు" అని గర్వంగా చెప్పింది.

లౌడెన్ కౌంటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనమిక్ డెవలప్‌మెంట్ (స్థానిక ప్రభుత్వం) ప్రతి సంవత్సరం 10 మంది ఉత్తమ రైతులను నామినేట్ చేస్తుంది. ఈ ఏడాది ఆ జాబితాలో ఉన్న ఏకైక భారతీయ మహిళా రైతును నేనే. 'వ్యవసాయం కూడా ఒక వృత్తే' అనే అవగాహన కలిగించడం ఆ సంస్థ ప్రధానోద్దేశం. అందులో భాగంగానే బుక్‌లెట్స్ ముద్రించి పంచుతారు. వీడియోలు ప్రదర్శిస్తారు. స్థానిక ప్రభుత్వం నుంచి గుర్తింపు పొందిన రైతులు... విద్యార్థులను వ్యవసాయ క్షేత్రానికి తీసుకువెళ్ళి... స్థానిక పంటల ప్రాధాన్యాన్ని వివరిస్తారు. పాఠశాలలో వీడియో చూసిన విద్యార్థులు "సాహితీ! మీ అమ్మ గ్రేట్" అన్నారని మా అమ్మాయి చెప్పినప్పుడు... నాకెంతో ఆనందం కలిగింది.

**తీరిక దొరికితే పొలానికే...**

ఉదయం అయిదు గంటలకు వ్యవసాయ క్షేత్రానికి వెళతాను. ఎనిమిదిన్నరకు తిరిగి ఇంటికి వస్తాను. ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం అయిదుగంటల వరకు ఆఫీస్ వర్క్ చేస్తాను. ఆ తర్వాత వీలైతే మరోసారి వ్యవసాయ క్షేత్రానికి వెళ్తాను. శని, ఆదివారాలు, సెలవు రోజులు ఎక్కువగా అక్కడే ఉంటాం. ప్రతీదీ ప్రణాళికాబద్ధంగా చేస్తాను... కాబట్టే వ్యవసాయం విజయవంతంగా సాగుతోంది. భవిష్యత్తులో డెయిరీ ఏర్పాటు చేయాలనీ, సీజనల్ పండ్లు పండించాలనీ ఉంది. ఎవరికైనా నేను కోరేది ఒక్కటే... మీ మూలాలకు దూరం కావద్దు." ■

విజ్ఞానాన్ని మించిన ఆయుధం లేదు, వివేకాన్ని మించిన సాధనం లేదు

# పిండి పదార్థాలు ... మంచీ, చెడు ... !

**పిండిపదార్థాలు శక్తి భాండాగారాలు. వీటిని పూర్తిగా మానేయడం సరైన పని కాదు. అయితే శరీర బరువును అదుపులో వుంచుకోవడం కోసం మంచి పిండిపదార్థాలను ఎంచుకోవాలి. వేటిని తినడం మానేయాలో, వేటిని తినాలో తెలుసుకోవాలి.**

-----------

**శ**క్తికి మూలాలైన పిండిపదార్థాలు లోపిస్తే నీరసం, నోటి దుర్వాసన, మలబద్ధకం,వాంతులు, తలనొప్పి మొదలైన లక్షణాలు మొదలవుతాయి. సరిపడా కార్బొహైడ్రేట్స్ తినడం లేదనే విషయాన్ని ఈ లక్షణాల ఆధారంగా గ్రహించాలి.

**మంచి పిండి పదార్థాలు (కాంప్లెక్స్ కార్బ్స్)**

వీటిలోని రసాయన రూపం, పీచులను జీర్ణం చేసుకోవ డానికి శరీరం ఎక్కువ శక్తిని ఖర్చు చేయవలసి వస్తుంది. వీటి నుంచి అందే శక్తి శరీరానికి ఎక్కువ సమయంపాటు ఉపయోగపడుతుంది. మంచి పిండి పదార్థాలలో....

- పోషకాలు, పీచు ఎక్కువ
- గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ
- తక్కువ క్యాలరీలతోనే కడుపు నిండుతుంది
- శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం (మెటబాలిజం)



పెరుగుతుంది.

పొట్టు తీయని గోధుమలతో తయారైన బ్రెడ్, రొట్టెలు, తృణధాన్యాలు, ఆకుపచ్చని కూరగాయలు, చిలకడదుంపలు, తాజా పండ్లు ఈ కోవకు చెందినవి.

**చెడు పిండిపదార్థాలు (సింపుల్ కార్బొహైడ్రేట్స్)**

ఇవన్నీ పొట్టు తీసి, పాలిష్ చేసిన పదార్థాలు. వీటిలో సహజసిద్ధ పోషకాలు,పీచు తక్కువ. చెడు పిండిపదార్థాల్లో....

- పోషకాలు, పీచు, పోషకాలు అతి స్వల్పం
- గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువ
- క్యాలరీలు కొవ్వుగా మారతాయి
- అత్యధిక గ్లూకోజ్ స్థాయిలు (నీరసం తెప్పిస్తాయి)

చాక్లెట్లు, తీపి పదార్థాలు, తీపి జోడించిన తృణధాన్యాలు, సోడాలు, శీతల పానీయాలు, పొట్టు తీసిన పిండ్లు ఈ కోవకు చెందినవి.

**మేలురకం పిండిపదార్థాలు...**

ఓట్స్‌తో తయారైన బిస్కెట్లు, నారింజ రసం, యాపిల్, కేరట్లు, టమేటాలు, ఎండుద్రాక్ష, ద్రాక్ష, అరటిపండ్లు.


**ఓట్‌మీల్:** ఎక్కువ సమయంపాటు శక్తినిచ్చే నిలకడైన పిండిపదార్థం ఇది. నీళ్లు కలిపి తయారుచేసిన ఒక కప్పు ఓట్‌మీల్‌లో 159 క్యాలరీలు ఉంటాయి. 4 గ్రాములు పీచు, 6 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.

**యాపిల్:** భోజనానికి, భోజనానికి మధ్య తీసుకోవలసిన ఈ అల్పాహార ఫలంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించే నాలుగు గ్రాముల పీచు, పెక్టిన్‌లు ఉంటాయి. మాంసకృత్తులు పుష్కలంగా ఉండే వేరుశెనగపప్పుతో తయారయ్యే వెన్నతో కలిపి తీసుకుంటే ప్రయోజనకరం.

**చిలకడ దుంపలు:** ఇది నిజమైన 'సూపర్ ఫుడ్'. కప్పు చిలకడదుంప ముక్కల్లో 7 గ్రాముల పీచు, అత్యధిక విటమిన్ ఎ, సిలు, 4 గ్రాముల మాంసకృత్తులు ఉంటాయి.

**మినుములు:** ఒక కప్పు ఉడకబెట్టిన పొట్టు తీయని మినుముల్లో 15 గ్రాముల పీచు, అంతే పరిమాణంలో మాంసకృత్తులు ఉంటాయి. ఇంత పరిమాణంలో పోషకాలు మరే పదార్థంలోనూ ఉండవు.

**టమాటాలు:** వీటిలో విటమిన్లు, ఖనిజలవణాలు పుష్కలం. పీచుతో పాటు లైకోపీన్ అనే యాంటీఆక్సిడెంటు కూడా వీటిలో ఉంటాయి. ■


नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
నీళ్ళ ట్యాంకు మరియు రెండు గుంతల మరుగుదొడ్డి
దీర్ఘ కాలం అందించెను మీకు సేవలు
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

MAHILA SADHIKARATHA
Publication Date: 01-06-2022 ; Posting Date: 05 & 06-06-2022
RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2021-23




ధీశాలి ఎఫ్ పి సి ' రూరల్ మార్ట్ ' ప్రారంభోత్సవ దృశ్యాలు ... పచ్చజెండా ఊపి ప్రారంభించిన నాబార్డ్ తెలంగాణా సి జి ఎం శ్రీ వై కె రావు, ఏపిమాస్ ఎండి, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ... రూరల్ మార్ట్ ప్రారంభోత్సవ సమావేశం





ధీశాలి వరి సేకరణ కేంద్రం ప్రారంభం ... గ్రామ భారతి కిసాన్ ఎక్స్‌పో లో ఏపిమాస్ స్టాల్ ను సందర్శించిన శ్రీ మోహనయ్య




ఆజీవ ఆనంతపురం మహిళా ఎఫ్ పి ఓ సిబ్బంది, పాలకవర్గ సభ్యుల శిక్షణ, అవగాహన పర్యటన దృశ్యాలు





' వాష్ ' కార్యక్రమంపై శిక్షణ దృశ్యాలు : జమ్మికుంటలో ... చొప్పదండిలో ... కొత్తపల్లిలో ...

To ADDRESS




బీహార్‌లో ఆరు ఎఫ్ పి ఓ పాలకవర్గాలకు శిక్షణ

బట్వాడా కాకపోతే దయచేసి ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089